

టీడీపీలో బాహాబాహీ

జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సమక్షంలోనే.. నిన్న రాజంపేట, రైల్వేకోడూరు, నేడు తంబళ్లపల్లె నియోజకవర్గాల్లో తెలుగుతమ్ముళ్లు బాహాబాహీకి దిగడం.. ఘర్షణ జరగవచ్చనే భయంతో.. మదనపల్లె నియోజకవర్గంలో సమావేశాన్ని ఏకంగా రద్దు చేయడం దేనికి సంకేతమనే ప్రశ్నలు రాజకీయ వర్గాల్లో సర్వత్రా వినిపిస్తున్నాయి. తగాదాలు, గ్రూపులు లేకుండా సమన్వయంతో అందరూ కలిసి పనిచేసేలా చూడాల్సిన పార్టీలో కీలక పదవుల్లో ఉన్న వారే.. వర్గాలను పెంచి పోషిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో అధికారంలోకి వచ్చి సరిగా పది నెలలు గడవక ముందే... దాదాపు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోనూ.. టీడీపీలో గ్రూపు తగాదాలు ఎక్కువయ్యాయి. ప్రతిపక్ష వైసీపీపైన పోరాటం చేయడం కంటే.. స్వపక్షంలోని కుమ్ములాటలతోనే అధికార పార్టీ నాయకులకు సరిపోతోంది. ఈ నేపథ్యంలో జిల్లాలో టీడీపీని అధిష్ఠానం గాలికొదిలేసిందా? అని రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

- ఇన్‌చార్జ్ మంత్రి సమక్షంలోనే ఘర్షణలు
- నిన్న రాజంపేట, రైల్వేకోడూరు.. నేడు తంబళ్లపల్లె
- ఈ రచ్చలు దేనికి సంకేతం.. ?
- జిల్లాలో పార్టీపై అధిష్ఠానానికి పట్టు వీడిందా..!



మంత్రి లోపల సమీక్షలో వుండగా బయట ఘర్షణ పడుతున్న ఇరువర్గాల కార్యకర్తలు

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): అధికారంలోకి వచ్చిన తర్వాత.. చాలా నియోజకవర్గాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు కొంత అసంతృప్తితో ఉన్నారని, ముఖ్యనాయకులు, ఎమ్మెల్యేలతో సమన్వయం లేదనే విమర్శలు జోరుగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో.. ఆయా జిల్లాలకు చెందిన ఇన్‌చార్జ్ మంత్రులు బాధ్యత తీసుకుని పార్టీని సమన్వయంతో నడిపించాలని అధిష్ఠానం ఆదేశించింది. నియోజకవర్గ స్థాయిలో సమావేశాలు పెట్టి.. కార్యకర్తలు, నాయకుల అభిప్రాయాలు తీసుకోవాలని ఆదేశించింది. దీంతో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి శనివారం జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశం ముగించుకుని రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లో పార్టీ ముఖ్యులతో సమావేశమయ్యారు. రాజంపేట పట్టణంలో జరిగిన సమావేశంలో... పలువురు టీడీపీ క్రియాశీలక నాయకులు స్వయంగా జిల్లా ఇన్‌చార్జ్ మంత్రినే పలు ప్రశ్నలు అడిగినట్లు తెలుస్తోంది. "గత ఎన్నికల్లో ఇక 20 రోజులు మాత్రమే సమయం ఉండగా మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే సుగవాసి పాలకొండ్రాయుడు కుమారుడు సుబ్రమణ్యంను పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించింది. ఎన్నికల్లో ఆయన కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. పార్టీలోని ముఖ్య నాయకులే వైసీపీతో కుమ్మక్కై ఆయనను ఓడించారనే ఆరోపణలున్నాయి. అయినా ఆయన్ను పక్కన పెట్టారు. నియోజకవర్గంలో ఆయన మాట చెల్లుబాటు కాకుండా.. టీడీపీ జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు మాటే అధికారులు వింటున్నారు. తనకు సరైన విలువ లేదని సుబ్రమణ్యం సమావేశానికి రాలేదు. ఇది సమంజసమేనా?" అని ఆ నాయకులు అడిగినట్లు తెలిసింది. దీనికి ఇన్‌చార్జ్ మంత్రి నుంచి సమాధానం లేనట్లు సమాచారం. తొలుత ఈ సమావేశానికి నియోజకవర్గ వ్యాప్తంగా ముఖ్యనాయకులు హాజరు కావాలని పార్టీ ముఖ్యులు ఆహ్వానించారు. అయితే సమావేశం మొదలవుతుందనగా.. కేవలం రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి పదవి ఉన్న నాయకులు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు మాత్రమే సమావేశానికి రావాలని ప్రకటించారు. దీంతో కొంత గందరగోళం నెలకొన్నా.. పోలీసులు జోక్యం చేసుకుని సర్దుబాటు చేశారు.

రైల్వేకోడూరు నియోజకవర్గంలో జరిగిన సమావేశంలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సమక్షంలో పెద్ద ఘర్షణే జరిగింది. ఇప్పటికే అక్కడ గతంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఉన్న విశ్వనాధనాయుడు, మరో సీనియర్ నాయకుడికి చెందిన వర్గం బలంగా ఉంది. వీళ్లందరూ సమన్వయంతో పనిచేయడంతో గత ఎన్నికల్లో అక్కడ కూటమి అభ్యర్థి జనసేనకు చెందిన, రూపానందరెడ్డి అనుచరుడు అరవ శ్రీధర్ గెలుపొందారు. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత... ఇక్కడ టీడీపీలోని ముఖ్యులను ప్రస్తుత నియోజకవర్గ ఇన్‌చార్జ్ పూర్తిగా పక్కన పెట్టారని చెబుతారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోనూ.. గతంలో వైసీపీలో క్రియాశీలంగా ఉన్న వ్యక్తులకే ప్రస్తుతం పనులు, పదవులు దక్కుతున్నాయని టీడీపీలోని మరో వర్గం ఆరోపిస్తోంది. ఈ నేపథ్యంలో స్వయంగా జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సమక్షంలోనే.. ఇరువర్గాలు తోపులాటకు దిగాయి. టీడీపీ కార్యాలయం అద్దాలు పగులకొట్టారు. దీంతో సమావేశాన్ని అర్ధాంతరంగా ముగించారు.

ఇకపోతే.. తంబళ్లపల్లె నియోజకవర్గానికి చెందిన సమావేశం ఆదివారం హార్సిలీహిల్స్‌లో నిర్వహించారు. ఇక్కడ పార్టీలోని వర్గాలు పరస్పరం కొట్టుకున్నాయి. ముందుగా ప్రకటించిన ప్రకారం.. ఈ సమావేశం ములకలచెరువు మార్కెట్‌యార్డులో జరగాల్సి ఉంది. అయితే నియోజకవర్గ ఇన్‌చార్జ్ జయచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే శంకర్‌యాదవ్ వర్గాల మధ్య ఘర్షణ జరుగుతుందనే సమాచారంతో.. సమావేశాన్ని హార్సిలీహిల్స్‌కు మార్చారు. పోలీసులు జోక్యం చేసుకుని.. మండలాల వారీగా ముఖ్యులను మాత్రమే హార్సిలీహిల్స్‌పైకి పంపించారు. గవర్నర్ బంగ్లాలో విడిది చేసిన జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తొలుత జయచంద్రారెడ్డి వర్గంతో సమావేశమయ్యారు. వాళ్లు చెప్పింది విన్నారు. తర్వాత శంకర్‌యాదవ్ వర్గంతో మాట్లాడేందుకు వీఎస్ఆర్ గ్రాండ్ రెస్టారెంట్‌కు వెళ్లారు. అక్కడ తొలుత పెద్దమండ్యం, తంబళ్లపల్లె మండలాల నాయకులతో మాట్లాడారు. ములకలచెరువు మండల నాయకులతో మాట్లాడుతుండగానే.. జయచందారెడ్డి వర్గీయులు తమ నాయకునికి వ్యతిరేకంగా చెప్తున్నారంటూ.. వాళ్లు కూడా లోపలికి చొచ్చుకొచ్చారు. దీంతో శంకర్‌యాదవ్, జయచంద్రారెడ్డి వర్గీయులు పరస్పరం దూషించుకుంటూ ఘర్షణ పడ్డారు. అరుపులు, ఈలలతో ఆ ప్రాంతం దద్దరిల్లింది. పోలీసులు జోక్యం చేసుకుని పరిస్థితిని అదుపు చేయాలని చూసినా ఉపయోగం లేకపోవడంతో.. ఇన్‌చార్జ్ మంత్రి సమావేశాన్ని రద్దు చేసుకుని వెళ్లిపోయారు. తర్వాత కూడా ఇరువర్గాల వారు కొట్టుకున్నారు. వీరిలో కొందరికి గాయాలైనట్లు సమాచారం. ఈ నేపథ్యంలో మదనపల్లెలో జరగాల్సిన సమావేశాన్ని మంత్రి రద్దు చేశారు. ఇక్కడ కూడా ఘర్షణ జరగవచ్చనే సమాచారంతోనే.. సమావేశాన్ని ముందుగానే రద్దు చేసినట్లు ప్రచారం జరుగుతోంది.

పార్టీని గాలికొదిలేశారా..?

జిల్లాలో ఇంత జరుగుతున్నా.. అధిష్ఠానం ఏమాత్రం పట్టించుకోకపోవడంతో జిల్లా పార్టీని గాలికొదిలేశారా అని పలువురు చర్చించుకుంటున్నారు. సాధారణంగా టీడీపీకి కొంత క్రమశిక్షణ కలిగిన పార్టీగా పేరుంది. అయితే గత ఎన్నికల్లో రాజంపేట, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లో పార్టీ ఓటమికి కారకులైన వారిపైన ఇప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో పాటు కీలక బాధ్యతలు ఇచ్చారనే ఆరోపణలు ఉన్నాయి. పది నెలలు గడుస్తున్నా.. ఇప్పటికీ ఆ రెండు నియోజకవర్గాల్లో ఓటమికి గల కారణాలపై జిల్లా అధ్యక్షుడు కానీ.. పార్టీ అధిష్ఠానం కానీ కనీసం సమీక్ష కూడా జరపలేదని పలువురు టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ పరిస్థితుల్లోనే.. జిల్లాలోని దాదాపు అన్ని నియోజకవర్గాల్లోనూ.. అధికార పార్టీలో గ్రూపు తగాదాలు రోజురోజుకు పెరుగుతున్నాయని చెప్పవచ్చు. ఈ నేపథ్యంలో రాష్ట్ర పార్టీ అధినాయకత్వం.. జిల్లాలో పార్టీని గాలికొదిలేసిందా? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. కాబట్టే... అధికారంలోకి వచ్చి పది నెలలైనా కాకముందే.. పోలీసుల భద్రతలో సమావేశాలు నిర్వహించుకోవాల్సిన దుస్థితి నెలకొందని పలువురు పేర్కొంటున్నారు.

కాళీయమర్దనుడిగా కోదండరాముడు



అశ్వవాహనంపై కొలువైన ఒంటిమిట్ట రామయ్య



కాళీయమర్దన అలంకారంలో దర్శనమిస్తున్న కోదండరాముడు

ఒంటిమిట్ట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్ట కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు అయిన ఆదివారం ఉదయం కోదండరాముడు కాళీయమర్దనాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తజన బృందాలు భజనలు, కోలాటాలు ఆడుతుండగా శ్రీరామచంద్రుడు కాళీయమర్దనుడి రూపంలో గ్రామ వీధుల్లో విహరించారు. ఉదయం వాహనసేవ అనంతరం 11 గంటలకు స్నపనతిరుమంజన నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె చందనంతో సీతారామ లక్ష్మణులకు విశేషంగా అభిషేకం నిర్వహించారు. రాత్రి కోదండరాముడు అశ్వవాహనంపై భక్తులను కటాక్షించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో నటేష్‌బాబు, ఆలయ ఇన్‌స్పెక్టర్ నవీన్, భక్తులు పాల్గొన్నారు.

నేడు చక్రస్నానం

కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం 9 గంటల నుంచి 10.30 గంటల వరకు చక్రస్నానం నిర్వహిస్తారు. రాత్రి ఏడు గంటలకు ధ్వజావరోహణతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. అలాగే మంగళవారం సాయంత్రం 6గంటల నుంచి 9గంటల వరకు కోదండరామస్వామి ఆలయంలో పుష్పయాగం, ఏకాంతసేవ నిర్వహిస్తారు.

కలెక్టరేట్‌లో ప్రవాసాంధ్రులకు ప్రత్యేక విభాగం

- జిల్లాలోని ప్రవాసీయులకు శుభవార్త

కలికిరి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఉపాధి, ఉద్యోగాల కోసం విదేశాల్లో ఉన్న తెలుగు వారి కోసం జిల్లా కలెక్టరు కార్యాలయంలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టరు కార్యాల యాల్లోనూ ఈ విధమైన విభాగాలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నా.. అన్నమయ్య జిల్లాకు చెందిన వేలాదిమంది వివిధ దేశాల్లో నివసిస్తున్న నేపథ్యంలో ఈ విభాగం ఏర్పాటు వారికి అన్నివిధాలా ఊరట కలిగించే అంశంగా చెబుతున్నారు. ఎన్ఆర్‌టీ (నాన్ రెసిడెంట్ తెలుగూస్) పేరుతో ఏర్పాటు కానున్న ఈ ప్రత్యేక విభాగం ప్రవాసీయులు ఎదుర్కొంటున్న పలురకాల సమస్యలకు పరిష్కారం చూపనుంది. ఈ విభాగానికి ప్రత్యేక అధికారిగా తహసీల్దారు స్థాయి కలిగిన ఒక అధికారిని జిల్లా కలెక్టరు నియమించాలని ప్రభుత్వం పేర్కొంది. అదే విధంగా జిల్లా పోలీసు స్పెషల్ బ్రాంచికి చెందిన సబ్ ఇన్‌స్పెక్టరు లేదా సర్కిల్ ఇన్‌స్పెక్టరు స్థాయి అధికారిని ఎన్ఆర్‌టీ స్పెషల్ పోలీసు ఆఫీస రుగా ఎస్పీ నియమిస్తారు. ఈ విభాగంలోని ప్రత్యేక అధికారులు ప్రవాసీయుల సమ స్యలపై ఆయా రాయబార కార్యాలయాలతో సంప్రదించి పరిష్కరిస్తారు. ప్రవాసీయులు ఎదుర్కొం టున్న ఆస్తులు, వారసత్వ సమస్యల పరిశీలనకు ఎన్ఆర్‌టీ విభాగం కృషి చేస్తుంది. ఇందుకోసం ఆన్‌లైన్ పోర్టల్‌ను ఏర్పాటు చేయనున్నారు. దీనిలోనే ప్రవాసీయులు తమ సమస్యలను, ఫిర్యాదు లను నమోదు చేసుకోవచ్చు. ఎన్ఆర్‌టీ స్పెషల్ ఆఫీసర్, పోలీస్ స్పెషల్ ఆఫీసర్లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమస్యలు ఎదుర్కొంటున్న ప్రవాసాం ధ్రులతో సంప్రదిస్తారు. ఇందుకు సంబంధిం చిన వివిధ శాఖలను స్థానికంగా సమన్వయం చేసుకొనే అధికారాలు వీరికి కల్పించారు. ఎన్ ఆర్‌టీ ఏర్పాటు, హక్కులు, బాధ్యతలు, ప్రభుత్వ పథకాలపై ప్రవాసాంధ్రు లకు అవగా హన కల్పించనున్నారు. ఆస్తుల వివాదాలు, కుటుం బ విభేదాలు, న్యాయ విషయాలు, ఆర్థిక మోసాలు, వైవాహిక వివాదాలు వంటి అన్ని రకాల సమస్యలతో సతమతమయ్యే వారికి ఈ ప్రత్యేక విభాగం అండగా నిలబడనుంది. ప్రధానంగా వర్క్ వీసాల విషయంలో పలు వురు ఏజెంట్ల చేతిలో మోసపోయి అక్కడ అవస్థల పాలవుతున్నారు. దీనికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా జీవో జారీ చేశారు.

ప్రజాసమస్యల పరిష్కార వేదిక

తాత్కాలిక రద్దు

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి(కలెక్టరేట్), ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): బాబాసాహెబ్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఈ నెల 14న సోమవారం జరగబోయే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి ఫిర్యాదులను సమర్పించేందుకు జిల్లా కలెక్టరేట్‌కు రావద్దని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

ఇంటర్మీడియట్ ఫలితాల్లో స్టేట్ ఫస్ట్

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి(కలెక్టరేట్), ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం ఫలితాల్లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ రాష్ట్రంలోనే మొదటి ర్యాంకు సాధించిందని కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ అధికారి సురేష్‌ను అభినందించారు. 2024-25 సంవత్సరానికి గానూ ఇంటర్మీడియట్ ఫలితాలను రాష్ట్ర ప్రభుత్వం శనివారం ప్రకటించింది. ఈ ఫలితాల్లో అన్నమయ్య జిల్లాలో వెనుకబడిన తరగతులశాఖ ఆధ్వర్యంలో నడపబడుతున్న హాస్టల్‌లో ఉండి ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం చదువుకునే విద్యార్థుల పాస్ పర్సంటేజ్‌లో రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానం సంపాదించినట్లుగా కలెక్టర్ తెలిపారు. మొదటి సంవత్సరం పరీక్షలను 221 మంది రాయగా 138(62.4 శాతం) మంది పాసయ్యారని, రెండవ సంవత్సరం పరీక్షలను 167 మంది రాయగా 141 మంది (84.4 శాతం) పాసయ్యారని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం ఫలితాల్లో జిల్లా మొదటి స్థానం సంపాదించడంలో జిల్లా అధికారులు, అధ్యాపకుల పాత్ర కీలకమని, వారి సహాయ సహకారాలతోనే ఈ విజయం సాధించగలిగామని ఆయన తెలిపారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నడపబడే హాస్టల్‌లో ఉండి చదువుకునే విద్యార్థులు మంచి విజయం సాధించారని, ఇలాంటి విజయాలు మున్ముందు మరెన్నో సాధించాలని ఆయన ఆకాంక్షించారు.

ఇన్వెస్ట్‌మెంటు పేరుతో రూ.25 కోట్లు కొల్లగొట్టారు..!

- నయామోసాలకు పాల్పడుతున్న సైబర్ నేరగాళ్లు
- 13 నెలల్లో 1,201 ఫిర్యాదులు

7

చెరువులను చెరబెట్టారు

రాతి చెరువు



గతంలో రాజులు ఉండేవారు.. రాజ్యాలు ఉండేవి అని పల్లెల్లో పెద్దవాళ్లు కథలు చెబుతుండేవారు. అదేవిధంగా ఇంకొన్నేళ్ల తర్వాత మన ఊరి పక్కన రాతి చెరువు ఉండేది.. ఆ చెరువు మా తాతల కాలంలో సుమారు 120 ఎకరాల భూమికి సాగునీరు అందించేది అని చెప్పుకోవాల్సిన పరిస్థితి వచ్చేలా ఉంది.. మండలంలోని పరిస్థితి చూస్తుంటే. రానురానూ ఈ చెరువు కర్పూరంలా కరిగిపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు.



బ్రిటీష్‌కాలంలో ఏర్పాటు చేసిన రాతిచెరువు తూము

- కుచించుకుపోతున్న రాతిచెరువు, చిన్నపిరెడ్డి కుంట
- ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం
- పట్టించుకోని అధికారులు

సుండుపల్లె, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో పోచంవాండ్లపల్లె సమీపంలో రాతి చెరువు ఉంది. ఆ చెరువు సుమారు 68.70 ఎకరాల విస్తీర్ణంలో ఉండేది. ప్రస్తుతం ఈ చెరువు కుచించుకుపోతోంది. ఈ చెరువు ద్వారా గతంలో రైతులు రెండు పంటలు పండించుకునేవారు. ప్రస్తుతం చెరువు విస్తీర్ణం తగ్గిపోతుండడంతో ఈ చెరువు దిగువ భాగంలో ఉన్న భూములకు సాగునీటి కొరత ఏర్పడుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ తాతలకు, ముత్తాతలకు అన్నం పెట్టిన ఈ చెరువు నిండితే ఒక కారు పంటలు పండించుకునేవారం. చెరువు చుట్టూ పచ్చని పొలాలు, తోటలతో ఆహ్లాదకరంగా కనిపిస్తున్న చెరువు మరికొన్నేళ్ల తర్వాత ఉండకపోవచ్చని స్థానిక రైతులు చెబుతున్నారు. చెరువు చుట్టూ ఆక్రమించి మామిడి తోటలు, వరిపంటలు, వేరుశనగ పంటలను సాగు చేస్తున్నారు. కొంత మంది చెరువును కూడా డీకేటీ పట్టాలుగా మార్చారని స్థానికులు ఆరోపిస్తున్నారు. బోర్లు వేసి మామిడి తోటలు సాగు చేస్తున్నారు. చెరువులోని మట్టిని తరలించి చెరువు చుట్టూ ఆక్రమణలకు వినియోగిస్తున్నారని చెబుతున్నారు. ఇంత పెద్దచెరువును ఆక్రమించి అక్రమ పట్టాలు సృష్టిస్తున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని స్థానిక రైతులు, కూటమి నాయకులు సుండుపల్లె తహసీల్దార్ దైవాదీనంకు ఈ మధ్యే వినతిపత్రం అందజేశారు. ఈ ఆక్రమణల నుంచి చెరువును కాపాడాలని కోరారు.

కంచె చేను మేస్తోందా...!

ప్రభుత్వ స్థలాలు, చెరువులు, వాగులు, కుంటలను కాపాడాల్సిన అధికారులు స్థానికులు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. గత కొన్నేళ్ల క్రితం నుంచి రాతిచెరువు అని తెలిసినా కూడా డీకేటీ పట్టాలను మంజూరు చేసినట్లు స్థానికులు చెబుతున్నారు. ప్రభుత్వ భూములను రక్షించాల్సిన రెవెన్యూ అధికారులే పట్టాలు ఇవ్వడం ఏమిటని కూటమి నాయకులు ప్రశ్నిస్తున్నారు. మండల కేంద్రంలోని అప్పన్నకుంట, రాయవరం గ్రామం జంగంపల్లి సమీపంలోని చిన్నపిరెడ్డికుంట లాంటి ఎంతో ఉపయోగకరమైన కుంటలను, రాతిచెరువు లాంటి రైతులకు అన్నం పెట్టే చెరువులు అన్యాక్రాంతం అవుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. ఇదంతా చూస్తుంటే కంచె చేను మేస్తోందా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఆక్రమణలపైన ఎవరైనా ఫిర్యాదు చేస్తే ఆక్రమణదారులతో మాట్లాడి కొంత మంది అధికారులు సర్దుబాటు చేసుకుంటున్నారని విమర్శలు కూడా లేకపోలేదు. ఇప్పటికైనా మండలంలో ఆక్రమణలపైన పైస్థాయి అధికారులు కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

చిన్నపిరెడ్డి కుంట ఆక్రమణ




ఉపాధి గుంతలు పూడ్చి చిన్నపిరెడ్డికుంటను ఆక్రమించిన దృశ్యం (ఫైల్‌ఫొటో)

మండలంలోని రాయవరం గ్రామ పంచాయతీలో జంగంపల్లి సమీపంలోని చిన్నపిరెడ్డికుంట ఆక్రమణలకు గురవుతోంది. ఈ కుంట విస్తీర్ణం 32 ఎకరాలు ఉండేది. వర్షాలు బాగా పడి ఈ కుంట నిండితే దిగువ భాగంతో పాటు పరిసర ప్రాంతాల్లో బోర్లలో సాగునీటి కొరత ఉండేది కాదు. కుంటలో ఉపాధి పనులు చేసి మరింత నీరు నిల్వ ఉండేలా అధికారులు ప్రణాళికలు వేసుకుని ఉపాధి కూలీలతో పనులు చేయించారు. అయితే కుంట చుట్టూ భూములు కలిగిన వ్యక్తులు రాను రానూ కుంటను ఆక్రమిస్తున్నారు. సుమారు 13 ఎకరాల్లో ఆక్రమణలకు గురైన కుంటను కాపాడాలని కోరుతున్నారు. ప్రభుత్వం ఉపాధి పనుల ద్వారా చేయించిన గుంతలను సైతం ఎక్సకవేటర్లతో పూడ్చి ఆక్రమణలు చేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఆక్రమణలకు పాల్పడితే చర్యలు

చెరువులు, కుంటల ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాము. చెరువులు ఆక్రమించి చెట్లు నాటడం, చెరువులో మట్టిని తొలగించడం చేస్తే వారిపై కేసులు పెడతాము. చెరువు ఆక్రమణలపై విచారించి చర్యలు తీసుకుంటాము.

- దైవాదీనం, తహసీల్దార్, సుండుపల్లె



ఆక్రమణలు ఆయకట్టుకు శాపం

రాతి చెరువు ఆక్రమణలు చెరువు దిగువ భాగంలో ఉండే రైతులకు శాపంగా మారింది. గతంలో చెరువు కింద రెండు కార్లు పంటలు పండేవి. ఇప్పుడు చెరువు నిండినా ఒక కారు పండించేందుకు కష్టంగా ఉంది. ఆక్రమణలు తొలగించి చెరువులో పూడికతీత పనులు చేయిస్తే రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. చెరువు దిగువ భాగంలో నాకు భూములు ఉన్నాయి. ఆక్రమణల వలన నష్టం జరుగుతోంది.

- ప్రసాద్‌రాజు, రైతు, వెంగమరాజుగారిపల్లె

ప్రాణం తీసిన ఈత సరదా..

● చెరువులో మునిగి విద్యార్థి మృతి



ఈతకు వెళ్లి మృతిచెందిన భాస్కర

పెద్దమండ్యం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): స్నేహితుడి స్వగ్రామంలో జాతర చూసేందుకు వెళ్లిన ఓ విద్యార్థి ప్రాణాలను ఈత సరదా బలి తీసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పెద్దమండ్యం మండలం కలిచెర్లకు చెందిన కేశవరెడ్డి కుమారుడు అరవింద్ కుమార్‌రెడ్డి, తంబళ్లపల్లి మండలం కోసువారిపల్లికి చెందిన రాజశేఖర్‌రెడ్డి, పీటీఎం మండలం బోర్లపల్లి గ్రామ పంచాయతీ పిడుమువారిపల్లికి చెందిన రెడ్డప్ప కుమారుడు భాస్కర ఇటీవలే పదో తరగతి పరీక్షలు రాశారు. పాలిటెక్నిక్ ఎంట్రెన్స్ కోసం మదనపల్లిలోని ఓ కోచింగ్ సెంటర్‌లో చేరారు. వీరి మధ్య స్నేహం కుదిరింది. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం అరవింద్‌తో కలసి ఇద్దరూ కలిచెర్ల పోలేరమ్మ తిరునాళ్లకు వచ్చారు. ఆదివారం గ్రామ సమీపంలోని పాపిరెడ్డిచెరువులోకి ఈతకు వెళ్లారు. ఈత కొడుతూ భాస్కర చెరువు నీటిలో మునిగిపోయాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు చెరువు వద్దకు వెళ్లి అతనిని వెలికి తీసే సరికే మృతి చెందాడు. ఈ సంఘటనతో గ్రామంలో విషాదం అలుముకుంది. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు గోడుగోడున విలపించారు. సంఘటన స్థలాన్ని పెద్దమండ్యం పోలీసులు పరిశీ లించారు.. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దమండ్యం ఎస్ఐ పీవీ రమణ తెలిపారు. మృతదేహాన్ని మదనపల్లి జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు వివరించారు.

రెండు స్కూటర్లు ఢీ.. మహిళ మృతి

● తండ్రీ కుమారుడికి తీవ్రగాయాలు



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గులాబ్‌జాన్

రామాపురం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కర్నూలు-చిత్తూరు 40వ జాతీయ రహదారిలోని రామాపురం మండలం బండపల్లి గ్రామం వీఆర్ పాఠశాల సమీపంలో ఆదివారం తెల్లవారుజామున రెండు స్కూటర్లు ఢీకొని షేక్ గులాబ్జాన్ (45) అనే మహిళ మృతి చెందగా తండ్రీకొడుకు గౌస్‌మోద్దీన్, మహమ్మద్ అనాస్‌లకు తీవ్ర గాయాలైనట్లు ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డి తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. రామాపురం మండలం వెంకటరెడ్డిగారిపల్లెకు చెందిన షేక్ గౌస్‌మోద్దీన్, ఆయన భార్య షేక్ గులాబ్జాన్, కుమారుడు మహమ్మద్‌అనాస్ రాయచోటికి వెళ్లి తిరిగి ఏపీ04 ఏటీ 3151 నెంబరు గల ఎక్స్‌ఎల్ స్కూటర్‌లో ఇంటికి వస్తున్నారు. వీఆర్ స్కూల్ సమీపంలోని పెట్రోల్ బంక్ వద్దకు రాగానే రాయచోటి నుంచి కడపకు వెళ్తున్న మోటారు సైకిల్ రాయల్ ఎన్‌ఫీల్డ్ ఏపీ40 ఎఫ్‌సీ7187 నడుపుతున్న వ్యక్తి అతివేగంగా వచ్చి ముందు వెళ్తున్న స్కూటర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ముగ్గురూ కిందపడిపోవడంతో తీవ్రగాయాలయ్యాయి. సంఘటన స్థలానికి రామాపురం పోలీసులు చేరుకొని గాయపడిన వారిని 108 అంబులెన్స్‌లో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా షేక్ గులాబ్‌జాన్ పరిస్థితి విషమించడంతో కడప రిమ్స్‌కు తరలించగా మార్గమధ్యంలో ఆమె మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయురాలు..

● భర్త, కుమార్తెకు గాయాలు ● కూతురి పరిస్థితి విషమం



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఉపాధ్యాయురాలు

మదనపల్లెఅర్బన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ ఉపాధ్యాయురాలు మృతిచెందగా, ఆమె భర్త, కూతురు తీవ్రంగా గాయపడ్డారు. అన్నమయ్య జిల్లా, కలకడ మండలానికి చెందిన శారద (40) కదిరిలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తుండగా, ఆమె భర్త వెంకటరమణ ములకచెరువు మండలం, సోంపాలెంలో ఉపాధ్యాయుడుగా పని చేస్తున్నాడు. వీరి కుమార్తె కీర్తి విజయవాడలో ఇంటర్ చదువుతోంది. ఇంటర్ ఫలితాల విడుదల సందర్భంగా శనివారం విజయవాడకు వెళ్లిన వారు, అక్కడి నుంచి కారులో తిరువణ్ణామలైకి వెళ్లారు. అక్కడి నుంచి కదిరికి వెళుతుండగా, ఆదివారం ఉదయం పుంగనూరు మండలం, సుగాలిమిట్ట వద్ద వీరు ప్రయాణిస్తున్న కారును ఐషర్ వాహనం ఢీకొంది. దీంతో ముగ్గురూ తీవ్రంగా గాయపడగా, స్థానికులు వారిని మదనపల్లెలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శారద మృతిచెందగా, వెంకటరమణ, కీర్తిని బెంగుళూరులోని మణిపాల్ ఆస్పత్రికి తరలించారు. కీర్తి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ఈ మేరకు పుంగనూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బంగారు దుకాణంలో చోరీ

● 4 కేజీల వెండి ● 20 గ్రాములు బంగారు చోరీ



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఖాజీపేట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఖాజీపేట నడిబొడ్డున ఉన్న వీఎస్ జ్యువెలరీ షాపులో ఆదివారం తెల్లవారుజామున దుకాణానికి ఉన్న తాళం పగులకొట్టి లోనికి ప్రవేశించి అందులో ఉన్న నాలుగు కేజీల వెండి, 20 గ్రాముల బంగారం తీసుకెళ్లారని పోలీ సులు తెలిపారు. వారు సీసీ కెమెరాలను గుర్తించకుండా చోరీకి పాల్పడడంతో రికార్డు అయింది. ఇందులో ముగ్గురు వ్యక్తులు ఈ చోరీకి పాల్పడినట్లు బయటపడింది. విషయం తెలుసుకున్న సీఐ మోహన్ సంఘటనా స్థలానికి చేరుకుని క్లూస్ టీంను తెప్పించి పరిశీలించారు. దుకాణ యజమాని షేక్ వహీద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఘాట్ రోడ్డులో లారీ టైర్లు దగ్ధం



కాలిపోతున్న కోళ్ల దాణా లారీ

రామాపురం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కర్నూలు-చిత్తూరు 40వ జాతీయ రహదారిలోని రామాపురం మండలం గువ్వలచెరువు ఘాట్ రెండో మలుపు వద్ద ఆదివారం కోళ్ల దాణా తీసుకువెళ్తున్న లారీ టైర్లు దగ్ధమయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. కడప నుంచి కోళ్ల దాణా చిత్తూరుకు తీసుకువెళ్తున్న ఏపీ39 ఉక్ 8371 గల లారీ గువ్వలచెరువు రెండో ఘాటు వద్ద రాగానే టైర్లకు మంటలు అంటుకున్నాయి. గమనించిన లారీ డ్రైవర్ లారీని ఆపి కిందకు దిగాడు. స్థానికుల సహాయంతో లక్కిరెడ్డిపల్లె అగ్నిమాపక కేంద్రానికి ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించి అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో..

రూ.25 కోట్లు కొల్లగొట్టారు..!







● నయామోసాలకు పాల్పడుతున్న సైబర్ నేరగాళ్లు

● మోసపోయిన వారిలో ఎక్కువగా ఉద్యోగులు, విద్యావంతులు

● 13 నెలల్లో 1,201 ఫిర్యాదులు

వెయ్యికి 2వేలు, 2వేలకు 4వేలు అంటూ సోషల్ మీడియా గ్రూపుల్లో వచ్చే ప్రకటనలకు కొంతమంది ఆశపడి డబ్బులు పెడతారు. ఆశ కాస్త అత్యాశగా మారడంతో లక్షలు, కోట్ల రూపాయలు పెట్టుబడులు పెట్టి సైబర్ నేరగాళ్లకు చిక్కి మోసపోతున్నారు. ఇటీవల ఆన్‌లైన్ పెట్టుబడి మోసాల కేసులు పెరుగుతున్నాయి. ఆన్‌లైన్ ట్రేడింగ్ ఇన్వెస్ట్‌మెంటు పేరుతో సైబర్ మోసగాళ్లు సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తూ డబ్బులు ఈజీగా కొట్టేస్తున్నారు. జిల్లాలో 13 నెలల్లో 1,201 ఫిర్యాదులు రాగా, రూ.25కోట్లకు పైగానే బాధితులు పోగొట్టుకున్నారు.

కడపక్రైం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఇప్పుడు ఆండ్రాయిడ్ మొబైల్ వినియోగిస్తున్నారు. ఇప్పుడున్న టెక్నాలజీతో ఏదో ఒక ఆశ చూపించి కష్టపడకుండానే సైబర్ నేరగాళ్లు డబ్బులు లాగేస్తున్నారు. ఇటీవల ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో కోట్లు కొల్లగొట్టారు. సైబర్ నేరగాళ్ల మాటలు నమ్మి డబ్బు ఇన్వెస్ట్ చేసిన వారిలో డాక్టర్లు, ఇంజనీర్లతో పాటు బీటెక్ విద్యార్థులు ఉండటం విశేషం. వీరికి ఇన్వెస్ట్‌మెంట్‌లపై అవగాహన ఉన్నప్పటికీ రూ.కోట్లు సంపాదించాలనే ఆశతో పెట్టుబడులు పెడుతున్నారు. అధిక లాభాలు వస్తాయంటూ షేర్ మార్కెట్లపై కొన్ని వాట్సప్ గ్రూపుల్లో పేర్లతో సహా ప్రతిరోజూ ప్రకటనలు వస్తున్నాయి. ఈ ప్రకటనలు చూసి అత్యాశతో ఎవరైనా స్పందిస్తే మాత్రం వారి ఖాతా ఖాళీ కావాల్సిందే. ఒక్కసారి వారి ఉచ్చులో పడితే భయపెట్టడంతో పాటు సైబర్ నేరగాళ్ల బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతున్నారు.

జిల్లాలో కొందరు బాధితులు

● కడపకు చెందిన ఓ డాక్టరు ట్రేడింగ్, స్టాక్‌మార్కెట్‌లో రూ.3కోట్లకు పైగా పెట్టుబడి పెట్టాడు. ఆయనకు ఒక్క రూపాయి కూడా రాకపోవడంతో మోసపోయానని గుర్తించి లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించాడు.

● మైదుకూరు వాసి అయిన కానిస్టేబుల్ ప్రస్తుతం వేరే జిల్లాలో పనిచేస్తున్నాడు. స్టాక్ మార్కెట్‌లో అధిక లాభాలు వస్తాయంటూ అతనితో పాటు స్నేహితులు, తోటి ఉద్యోగులతో దాదాపు రూ.3కోట్లకు పైగానే పెట్టుబడులు పెట్టించాడు. వీళ్ల డబ్బులు పెట్టడమే కానీ తిరిగి రాలేదు. దీంతో బాధితులంతా ఆ కానిస్టేబుల్‌పై వత్తిడి తెస్తున్నారు. ఆయన స్పందించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

● కమలాపురానికి చెందిన ఓ వ్యక్తి చుట్టుపక్కల గ్రామాలకు చెందినవారికి స్టాక్‌మార్కెట్‌పై అవగాహన కల్పించి వారితో లక్షలకు లక్షలు పెట్టుబడులు పెట్టించాడు. తాము కట్టిన డబ్బులు తిరిగి ఇవ్వాలని ఇటీవల వారు కోరినప్పటికీ అతను సరిగా స్పందించకపోవడంతో బాధితులందరూ పోలీసులను ఆశ్రయించారు.

● స్టాక్‌మార్కెట్లో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయి, దీంతో ఉద్యోగాలు కూడా అవసరం లేదనే భావనతో కడపకు చెందిన బీటెక్ చదివిన ఓ యువకుడు లక్షల్లో పెట్టుబడి పెట్టాడు. మొదట బాగున్నా తరువాత ఆ స్టాక్‌మార్కెట్ బోర్డు తిప్పేశారు. ఇతనూ పోలీసులను ఆశ్రయించాడు.

స్టాక్‌మార్కెట్‌లో పెట్టుబడులు

చాలా మంది ఉద్యోగులు, విద్యావంతులు సెల్‌ఫోన్‌లో ఇన్‌స్టాగ్రామ్, వాట్సప్ తదితర సోషల్ మీడియాల్లో వచ్చే ట్రేడింగ్ ప్రకటనలకు స్పందిస్తున్నారు. మొదట స్వల్పంగా పెట్టుబడి పెడితే తిరిగి రెట్టింపు ఇస్తారు. దీంతో వారికి ఆశ పెరిగి పోతుండడంతో పెట్టుబడి లక్షలు, కోట్ల రూపాయలకు చేరుతోంది. సైబర్ నేరగాళ్లు వారి టార్గెట్ రీచ్ కాగానే బోర్డు తిప్పేస్తున్నారు. దీంతో బాధితులకు కమ్యూనికేషన్ లేకపోవడం, ఎవరిని అడగాలో తెలియక చివరికి పోలీసులను ఆశ్రయిస్తున్నారు. పోలీసులు కూడా బాధితుల ఫిర్యాదు తీసుకుని విచారిస్తుండగా తప్పుడు చిరునామాలతో ఈ స్టాక్‌మార్కెట్‌ను క్రియేట్ చేస్తున్నట్లు గుర్తిస్తున్నారు. ఈ స్కామ్‌లో ఎవరున్నారు, మనీ ట్రాన్స్‌ఫర్ ఎలా జరిగిందన్నదానిపై ఆరా తీసినప్పటికీ విచారణ కొంతవరకు సాగినా చివరికి ఇతర రాష్ట్రాలు, దేశాలవరకు ఈ నేరగాళ్ల లింకులు ఉన్నట్టు తెలుస్తోంది. దీంతో సైబర్ నేరగాళ్లను పట్టుకోవాలన్నా పోలీసులకు కష్టసాధ్యంగా మారుతోంది. అత్యధిక లాభాలు వస్తాయంటూ ఆశచూపే చోట పెట్టే పెట్టుబడులతో పోయేదే కానీ వచ్చేదేమీ ఉండదు. అయినా సరే జనాల్లోని ఆశను సైబర్ నేరగాళ్లు ఆయుధంగా మలచుకుంటూ చాకచక్యంగా సొమ్ము దోచేస్తున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



సోషల్ మీడియాలో వచ్చే ప్రకటనలపై ఎవరూ స్పందించవద్దు. పెట్టుబడులకు రెండింతలు ఇస్తామంటే ఎవరైనా ఆశపడి డబ్బు పెట్టారంటే చివరికి ఒక్కరూపాయి కూడా రాదు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఇలాంటి ప్రకటనలతో మిమ్మల్ని మోసం చేసి సైబర్ నేరగాళ్లు డబ్బులు స్వాహా చేస్తున్నారు. ఎవరైనా డబ్బులు పోగొట్టుకుంటే తక్షణమే సైబర్ సెల్‌లో సంబంధిత పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి. లేదా 1930కి కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. అలాగే సైబర్‌నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

- మధుమల్లేశ్వర్‌రెడ్డి, సీఐ, సైబర్ సెల్

టీడీపీ వర్గీయులపై వైసీపీ దాడి

● కృష్ణాపురం ఘటనపై వేగంగా స్పందించిన పోలీసులు

● ఇరువురు వైసీపీ వర్గీయుల అరెస్ట్

● ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ

రాయచోటిటౌన్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య-చిత్తూరు జిల్లాల సరిహద్దు ప్రాంతంలోని పుంగనూరు మండల కృష్ణాపురం గ్రామానికి చెందిన టీడీపీ సానుభూతి పరులపై వైసీపీ సానుభూతి పరులు భూమి వివాద విషయంగా దాడి చేసి గాయపర్చినట్లు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న విషయంపై ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు వేగంగా స్పందించి ప్రత్యేక టీంలను ఏర్పాటు చేశారు. దాడికి పాల్పడిన వేణుగోపాల్, భరత్‌లను ఆదివారం అరెస్టు చేసి కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను ఆదివారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు మీడియాకు వెల్లడించారు. జిల్లా పరిధిలోని నిమ్మనపల్లి మండలం, బండ్లపై గ్రామ పంచాయతీలోని జాండ్రబైలులో నివాసం ఉంటున్న మల్లంపల్లి రామస్వామికి పుంగనూరు మండలం చెండ్రమాకులపల్లి పంచాయతీలోని కృష్ణాపురం వద్ద సర్వే నెంబర్ 740(4)లో 3.05 ఎకరాల భూమి ఉందన్నారు. రామస్వామికి నలుగురు కుమారులు కాగా వరుసగా వేణుగోపాల్, హరినాథ్, మోహన్, మల్లికార్జునలకు వివాహాలయ్యాయన్నారు. వీరిలో వేణుగోపాల్, మల్లికార్జునలు జాండ్రబైలులో కాపురం ఉంటుండగా హరినాథ్ పుంగనూరు మండలం చెండ్రమాకులపల్లి పంచాయతీలోని కృష్ణాపురంలో కాపురం ఉంటున్నాడని తెలిపారు. మోహన్ దుబాయ్‌లో ఉంటున్నాడన్నారు. అయితే రామస్వామికి సంబంధించిన భూమిలో పెద్ద కుమారుడు వేణుగోపాల్, రెండో కుమారుడు హరినాథ్ ప్రస్తుతం వ్యవసాయం చేసుకుంటూ ఉన్నారన్నారు. వీరిలో వేణుగోపాల్ వైసీపీ సానుభూతిపరులు కాగా హరినాథ్ టీడీపీ సానుభూతిపరులుగా ఉన్నారని తెలిపారు. ఈ క్రమంలో ఈ నెల 12న శనివారం మధ్యాహ్నం వేణుగోపాల్ కొడుకు భరత్ సదరు పొలం దగ్గరికి వెళ్తుండగా హరినాథ్ కుమారుడు వెంకటేశ్ ఈ దారిలో నడవద్దని చెప్పడంతో గొడవ జరిగిందన్నారు. భరత్ అంతటితో అక్కడి నుంచి వెళ్లిపోయి తిరిగి సాయంత్రం అతని భార్యతో కలిసి సదరు పొలం దగ్గరికి వెళ్తుండగా అక్కడ ఉన్న హరినాథ్, అతని కుమారుడు వెంకటేశ్‌లు ఘర్షణ పడ్డారు. ఇందులో హరినాథ్, వెంకటేశ్‌ను పక్కనే ఉన్న టమోటా సీడ్ కట్టెలతో భరత్ దాడి చేయడంతో రక్తగాయాలయ్యాయన్నారు. భరత్‌కు కూడా చిన్నచిన్న గాయాలయ్యాయన్నారు. ఈ విషయమై హరినాథ్, అతని కుమారుడు వెంకటేశ్ పుంగనూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. భూమికి సంబంధించిన సమస్యలు, ఇతర సమస్యలు ఉంటే వాటిని చట్టబద్ధంగా, న్యాయబద్ధంగా పరిష్కరించుకోవాలని, వ్యక్తిగత కక్షలు పెంచుకుని వర్గాలు, గ్రూపులుగా ఏర్పడి ప్రజాశాంతికి విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

వృద్ధురాలి హత్య కేసును తప్పుదోవ పట్టిస్తున్నారు

● న్యాయం చేయాలని కుటుంబ సభ్యుల ఆందోళన

● ఎమ్మెల్యే చొరవతో సర్దుబాటు

● నగలు, నగదు విషయం ఎఫ్ఐఆర్‌లో చేర్చాలని ఆదేశం



బెంగళూరు రోడ్డులో బైఠాయించి నిరసన చేస్తున్న బాధితులు

మదనపల్లెఅర్బన్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): హత్యకు గురైన వృద్ధురాలి మెడలో ఉన్న నగలు, ఆమె వద్ద ఉన్న రూ.రెండు లక్షల నగదు విషయం వెంటనే తేల్చాలని ఎమ్మెల్యే షాజహాన్ బాషా పోలీసు అధికారులను ఆదేశించారు. గంగులమ్మ అనే వృద్ధురాలిని విష్ణు అనే ఆటో డ్రైవర్ హత్య చేసి, ప్రమాదంగా చిత్రీకరించాలని ప్రయత్నించిన విషయం తెలిసిందే. ఈ విషయంలో తమకు న్యాయం చేయాలంటూ హతురాలి కుటుంబసభ్యులు, బంధువులు సుమారు 200 మంది ఆదివారం ఉదయం తాలూకా పోలీస్‌స్టేషన్ సమీపంలోని బెంగళూరు జాతీయ రహదారిపై బైఠాయించి ఆందోళన చేశారు. రూయా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తమ పెద్దమ్మ కుమారుడు వెంకటరమణకు డబ్బు అవసరం కావడంతో, అతనికి ఇచ్చేందుకు రూ.2 లక్షలు తీసుకుని ఇంటి నుంచి బయలుదేరిందని ఆమె కుమారులు తెలిపారు. ఆర్టీసీ బస్టాండుకు వెళ్లేందుకు చంద్రాకాలనీలో ఆటో ఎక్కిందని వివరించారు. అయితే, ఆటో డ్రైవర్ సీఎస్ఐ చర్చి వద్ద దింపాడని, ఐదు రూపాయలు విషయంలో గొడవపడినట్లు పోలీసులు కట్టుకథ అల్లుతున్నారని బాధితులు ఆరోపించారు. ఐదు రూపాయల కోసం హత్య చేసినట్లు పోలీసులు ఎఫ్ఐఆర్ చూపడం తప్పన్నారు. తమకు న్యాయం చేయకపోతే ఆత్మహత్య చేసుకుంటానంటూ గంగులమ్మ మనుమడు మనోహర్ ఒంటిపై పెట్రోల్ పోసుకోవడంతో పోలీసులు, కుటుంబసభ్యులు అడ్డుకున్నారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే షాజహాన్ బాషా అక్కడికి చేరుకుని బాధితులకు అండగా ఉంటామని చెప్పడంతో వారు ఆందోళన విరమించారు. ఎమ్మెల్యే బాధితులతో పాటు పోలీస్‌స్టేషన్ వద్దకు వచ్చి బాధితుల ఫిర్యాదును, పోలీసులు నమోదు చేసిన ఫిర్యాదులోని వివరాలను ఎస్ఐ గాయత్రితో చదివించారు. ఎఫ్ఐఆర్‌లో గంగులమ్మ మెడలో ఉన్న నగలు, రెండు లక్షలు క్యాష్ విషయం లేదని, వెంటనే చేర్చి దర్యాప్తు చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని మృతదేహాన్ని పరిశీలించి శ్రద్ధాంజలి ఘటించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బాధితులకు అప్పగించారు. రూరల్ సీఐ సత్యనారాయణ, టూటౌన్ సీఐ రామచంద్ర, టీడీపీ నాయకులు హరిబాబు, చెండ్రాయులు, గురునాథ్, బాబా పాల్గొన్నారు.

చెన్నూరు ఎస్‌బీఐలో చోరీకి విఫలయత్నం

చెన్నూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు ఎస్‌బీఐలో గుర్తు తెలియని వ్యక్తులు షట్టర్ తాళాలు పగలగొట్టి లోపలికి ప్రవేశించి బ్యాంకు సేఫ్ లాకర్లను బలవంతంగా ఓపెన్ చేసేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. బ్యాంకులో బయటి వైపు ఉన్న సీసీ కెమెరాల వైర్లు కట్ చేసి సీసీ ఫుటేజీ (డీవీఆర్) తీసుకెళ్లారు. అంతేకాక బ్యాంకు క్లోజింగ్ బ్యాలెన్స్ అమౌంటు సుమారు రూ.20వేలు చోరీ చేశారు. ఆదివారం సాయంత్రం బ్యాంకులో పనిచేసే మెసెంజరు లైటు వెలగకపోవడంతో ఈ విషయం బ్యాంకు సిబ్బందికి తెలిపారు. వారు పోలీసు సిబ్బందికి సమాచారం తెలిపారు. బ్యాంకు మేనేజరు సుజిత ఈ విషయాన్ని పై అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్థానిక సీఐ, డీఎస్పీ వెంకటేశ్వర రావు, తాలుకా సీఐ వెంకటేశ్వర్లు, క్లూస్‌టీం సిబ్బంది బ్యాంకు పరిసరాలను గమనించారు. ఈ విషయంపై కడప డీఎస్పీ మాట్లాడుతూ దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

మెడికల్ ఏజన్సీలో చోరీ

రూ.1.21 లక్షలు అపహరణ

కడపక్రైం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కడప నగరం బీకేఎం వీధిలో ఈశ్వర్ మెడికల్ ఏజన్సీలో దొంగలు నగదును అపహరించినట్లు కడప టూటౌన్ ఎస్ఐ హుసేన్ తెలిపారు. ఆయన వివరాల మేరకు కడపకు చెందిన శివకుమార్ ఈ నెల 11న రాత్రి ఏజన్సీ మూసి ఇంటికి వెళ్లాడు. తిరిగి ఉదయం వచ్చి చూసేసరికి దొంగలు ఏజన్సీ షట్టరు పగలగొట్టి రూ.1.21 లక్షల నగదును అపహరించినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

డబ్బులు తీసుకున్నట్లు నిరూపించాలి

● మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే రమేశ్‌కుమార్‌రెడ్డి

రాయచోటి టౌన్, ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి): తాను కోట్లు డబ్బులు తీసుకొని వైసీపీ కోసం పనిచేశానని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడడం సిగ్గుచేటని, డబ్బులు తీసుకున్నట్లు నిరూపించాలని మాజీ ఎమ్మెల్యే రమేశ్‌కుమార్‌రెడ్డి సవాల్ విసిరారు. ఆదివారం ఆయన స్థానిక వైసీపీ జిల్లా కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తీరు కుక్కను సింహాసనం ఎక్కించినట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. నియోజకవర్గంలో తిరగనీయకుండా చేయడం ఎవరి తరం కాదని హెచ్చరించారు. టీడీపీ కోసం ఎంతో కష్టపడి పనిచేశానని, గత ఎన్నికల్లో తనకు తీరని అన్యాయం చేయడంతోనే వైసీపీలోకి వెళ్లడం జరిగిందన్నారు. తాను డబ్బులు తీసుకున్నట్లు నిరూపిస్తే ఇంకెప్పుడూ రాజకీయాల గురించి మాట్లాడనన్నారు. కంకర ఎవరు దొంగలించారో అధికారులతో విచారణ జరిపించి నిగ్గుతేల్చాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో వైసీపీ నేతలు విజయభాస్కర్, కొలిమి హారూన్‌బాషా, రవీంధర్‌నాయుడు, శ్యామ్‌కుమార్, మహేంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

'మంత్రి గురించి మాట్లాడే అర్హత లేదు'



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

రాయచోటిటౌన్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని విమర్శించే హక్కు మాజీ ఎమ్మెల్యే రమేశ్‌రెడ్డికి లేదని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా, 20వ వార్డు కౌన్సిలర్ మదన్‌మోహన్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ చెన్నూరు అన్వర్‌బాషా, జిల్లా మైనార్టీ కార్యదర్శి వతన్ నిస్సార్, టీడీపీ జిల్లా కార్యదర్శి మట్లి శ్రీనివాసులునాయుడు, మాజీ ఎంపీపీ వెంకటనారాయణరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయంలో వారు మీడియతో మాట్లాడారు. కంకర దొంగలించాల్సిన అవసరం మంత్రికి లేదని, అనవసరంగా మంత్రిపైనా, కుటుంబంపైన అసత్య ఆరోపణలు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. ఆరోపణలు చేసే ముందు మంత్రి గురించి తెలుసుకోవాలన్నారు.

'ఓర్వలేకనే మంత్రిపై అసత్య ఆరోపణలు'



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న
రాయచోటి, రామాపురం మండలాల టీడీపీ నేతలు

రాయచోటిటౌన్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మండిపల్లి కుటుంబం పది మందిని ఆదరించి సహాయం చేసే కుటుంబమే గానీ దొంగతనాలను ప్రోత్సహించే కుటుంబం కాదని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి బాలిశెట్టి చంద్రమౌళి, టీడీపీ నేతలు అనుంపల్లి రాంప్రసాద్‌రెడ్డి, సుజాత, జాఫర్‌అలీఖాన్, ఆగ్రో వెంకట్రామిరెడ్డి, గుర్రం సుబ్బయ్యనాయుడు, నూరెకరాల రంగారెడ్డి, మాజీ సర్పంచ్ మేఘనాథరెడ్డి, సంజీవరెడ్డి, జయరాంరెడ్డి, శివారెడ్డి అన్నారు. గతంలో తెర వెనుక నుండి ఇసుక, మట్టి మాఫియాను నడిపించిన నాయకులెవ్వరనేది నియోజకవర్గమంతా కోడై కూసిందన్నారు. నియోజకవర్గంలో మంత్రి చేస్తున్న అభివృద్ధిని ఓర్వలేకనే రమేశ్‌రెడ్డి ఆరోపిస్తున్నారన్నారు.

వైసీపీ సోషల్ మీడియాపై టీడీపీ నేతల ఫిర్యాదు

రైల్వేకోడూరు రూరల్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాఘవరాజుపురం వద్ద ఉన్న టీడీపీ పార్టీ కార్యాలయంలో శనివారం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి, రాయలసీమ క్లస్టర్ ఇన్‌చార్జ్ దీపక్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన టీడీపీ పార్టీ సమన్వయ సమావేశంలో కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌పై టీడీపీ పార్టీకి చెందిన ఒక వర్గం దాడి చేసినట్లు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు వారు రైల్వేకోడూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్న వైసీపీ సోషల్ మీడియాపై కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు మాజీ ఉపసర్పంచ్ వార్డు మెంబర్ నార్జాల హేమరాజ్, పోతురాజు సుమన్ తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో మట్టల పండుగ

సిద్దవటం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన సిద్దవటంలోని దిగువపేటలోని గ్రెస్ ప్రార్థన మందిరంలో ఆదివారం మట్టల పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాస్టర్ మోహన్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు శిలువతో చనిపోయాక ముందటి ఆదివారం యాదుల రాజుగా గాడిదమీద ఆయనను ఊరేగించారన్నారు. ఆ క్రమంలో అప్పటి ప్రజలు రోడ్లవెంబడి ఈతమట్టలు పరిచి వాటిమీద వస్త్రాలు పరిచి ఊరేగించారన్నారు. ఆ విధంగానే గ్రీన్ ప్రార్థన మందిరం క్రైస్తవులు అందరూ ఈతమట్టలను చేత పట్టుకుని పురవీధుల గుండా తిరిగారు. కార్యక్రమంలో క్రైస్తవ సంఘం పెద్దలు చిన్నబాబు, ప్రసాద్ మహిళా సంఘం నాయకులు పాల్గొన్నారు.



అభివృద్ధి కార్యక్రమాలతో
రూపురేఖలు మారనున్న రాయచోటి

● మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

చిన్నమండెం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): రాయచోటి నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించి పట్టణ రూపురేఖలు మార్చనున్నట్లు రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆదివారం చిన్నమండెం మండలం బోరెడ్డిగారిపల్లెలోని తమ నివాసంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎటువంటి అభివృద్ధికి నోచుకోని రాయచోటి నియోజకవర్గం వెనుకబడిందని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతి గ్రామంలో సిమెంటు రోడ్లు, మంచినీటి సమస్యలు పరిష్కరించడం, డ్రైనేజీ కాలువలు, వీధిలైట్లు తదితర అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తుండటంతో నియోజకవర్గ రూపురేఖలు మారుతున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన కేవలం 9 నెలల కాలంలోనే ప్రాధాన్యతా క్రమంలో అవసరమైన గ్రామాల్లో సిమెంటు రోడ్లు, అభివృద్ధి పనులు చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా మంత్రి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితుల అర్జీలు స్వీకరించి, సంబంధిత అధికారులతో మాట్లాడి అక్కడికక్కడే పరిష్కరించడం జరిగింది.



ప్రజా దర్బార్‌లో ప్రజా సమస్యలు వింటున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజల దాహం తీర్చడమే లక్ష్యం : మంత్రి

సంబేపల్లె, ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి): రాయచోటి నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజల దాహం తీర్చడమే లక్ష్యమని, నీటి సమస్య ఉన్న ప్రతి పల్లెలో బోరు త్రవ్వకాలు చేపడుతున్నట్లు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆదివారం సంబేపల్లె మండలం నారాయణరెడ్డిపల్లె గ్రామం సుద్దలవాండ్లపల్లెలో నీటి సమస్య పరిష్కరించేందుకు నూతన బోరును ప్రారంభించారు. ఇప్పటికే నియోజకవర్గంలో తాగునీటి సమస్య ఉన్న ప్రతి గ్రామాన్ని గుర్తించి నూతన బోర్లు వేసి తద్వారా తాగు నీటిని అందిస్తున్నామన్నారు. అలాగే కార్యకర్తలకు టీడీపీ సభ్యత్వ నమోదు కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి కృషి : మంత్రి

రామాపురం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి విశేష కృషి చేస్తున్నదని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం గువ్వలచెరువు గ్రామంలో నూతనంగా నిర్మించిన మసీదును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమం లో టీడీపీ నాయకులు బాలిశెట్టి చంద్రమౌళి, రేఖం ఆంజనేయులు బ్రదర్స్ చెన్నక్రిష్ణారెడ్డి, రెడ్డికుమార్, హరిప్రసాద్, మైనార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

'అంబేడ్కర్ ఆశయ సాధనకు బీజేపీ కృషి'

● విగ్రహం వద్ద శ్రమదానం చేసిన బీజేపీ నేతలు



అంబేడ్కర్ విగ్రహం వద్ద దీపారాధన చేస్తున్న బీజేపీ నాయకులు

రాజంపేట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): అన్నివర్గాలకు సమన్యాయం, సమాన అవకాశాలు లభించాలన్న అంబేడ్కర్ ఆశయాల సాధనకు బీజేపీ కట్టుబడి ఉందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, నంద్యాల జిల్లా ఇన్‌చార్జి పోతుగుంట రమేష్‌నాయుడు తెలిపారు. పార్టీ పిలుపు మేరకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ముందస్తుగా ఆదివారం స్థానిక ఆర్ అండ్ బీ అతిథిగృహం వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద శ్రమదానం చేసి దీపారాధన చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీ అంబేడ్కర్‌కు, దేశానికి సేవలు చేసినవారికి సరైన గుర్తింపు ఇవ్వలేదని, బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాతే వారికి భారతరత్న ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎం.రమణయ్య, బీజేపీ జిల్లా కార్యదర్శి తోట ధీరజ్, పట్టన అధ్యక్షుడు వీవీ రమణ, మండల అధ్యక్షుడు ప్రసాద్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు, పట్టణ ఉపాధ్యక్షుడు రమణారెడ్డి, బీజేవైఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక ప్రదేశాల్లో తనిఖీలు

● కడప డీఎఫ్‌వో వినీత్‌కుమార్ పరిశీలన



లంకమల్ల అటవీ ప్రాంతంలో తనిఖీలు చేపట్టిన కడప డీఎఫ్‌వో

సిద్దవటం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): సమస్యాత్మక అటవీ ప్రాంతమైన సిద్దవటం ఫారెస్ట్ రేంజి పరిధిలోని గొల్లపల్లె, రోళ్లబోడు, సిద్దవటం బీట్ సమస్యాత్మక ప్రదేశాల్లో కడప డీఎఫ్‌వో వినీత్‌కుమార్ తనిఖీలు చేపట్టారు. అనంతరం రోళ్లబోడు బేస్ క్యాంపు సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫారెస్ట్ రేంజ్ పరిధిలో చెక్‌పోస్టు వద్ద రాత్రి వేళల్లో అప్రమత్తంగా ఉండి వాహనాలు తనిఖీ చేయాలన్నారు. అటవీ ప్రాంతంలో వన్య ప్రాణుల పట్ల వేసవికాలం దృష్టిలో పెట్టుకుని అందుబాటులో ఉన్న నీటి తొట్లలో తాగునీరు నింపాలన్నారు. కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ అధికారి కళావతి, డీఆర్వో ఓబులేశు, ఫారెస్ట్ రేంజ్ సిబ్బంది పాల్గొన్నారు.

గంగమ్మ తల్లికి పూజలు

లక్కిరెడ్డిపల్లె, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతపురం గ్రామంలో వెలసిన గంగమ్మతల్లికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఆదివారం వేలసంఖ్యలో భక్తులు గంగమ్మ జాతరకు చేరుకొని అమ్మవారికి ముడుపులు, బోనాలు చెల్లించారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది వచ్చిన భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

రైల్వేకోడూరు రూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్టిగుంట ఉప్పరపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న రైల్వే గేటు వద్ద ఆదివారం రేణిగుంట వైపుగా ప్రయాణిస్తున్న రైలు నుండి 25సంవత్సరాల గుర్తు తెలియని వ్యక్తి ప్రమాదవశాత్తు జారిపడి మరణించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిస్తే 9885753379, 9963126343 ఫోన్ నెంబర్లకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వేపోలీసులు తెలిపారు.



రైల్వే గేటు వద్ద పడి ఉన్న మృతదేహం

గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభను పెంపొందించాలి

వీరబల్లి, ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి): నేటి కంప్యూటర్ యుగంలో పట్టణాలు, గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం పెంపొందించాల్సిన అవసరం ఉందని వీఆర్‌డీఎస్ సురేంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వంగిమళ్ల గ్రామం దుగ్గనపల్లిలో నూతన రామాలయం ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొని ఆలయ దాతలు దుగ్గనపల్లి లోకేశ్వర్‌రెడ్డి, భాగ్యమ్మ దంపతులను సత్కరించారు. వృత్తిరీత్యా టాంజానియా దేశంలో ఉంటూ సొంతూరు మీద మమకారంతో సుమారు యాభై లక్షల రూపాయలు వెచ్చించి గ్రామస్థుల సహకారంతో రామాలయం నిర్మించడం గర్వించదగ్గ విషయమన్నారు. ఈ సందర్భంగా సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం అందించారు. కార్యక్రమంలో యర్రపురెడ్డి మధుసూదన్‌రెడ్డి, జయారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, లక్ష్మిశేఖర్‌రెడ్డి, సదాశివారెడ్డి, శ్రీనివాసులరెడ్డి, మాధారెడ్డెన్న, రవి, పెంచల్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, కార్తీక్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రామాలయం ప్రారంభోత్సవంలో పాల్గొన్న సురేంద్రారెడ్డి

నేడు మెగా వైద్యశిబిరం

సిద్దవటం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని సోమవారం సిద్దవటంలో మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు అంబేడ్కర్ నేషనల్ డివిజన్ ట్రస్టు ప్రతినిధులు లోకేష్, శివప్రసాద్ తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ సిద్దవటంలోని దిగువపేట ప్రధాన రహదారిలోని ఎంపీపీ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఈ వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రముఖ వైద్యనిపుణులు వైద్యశిబిరంలో పాల్గొని చిన్నపిల్లలు, చెవి, ముక్కు, గొంతు, షుగర్, థైరాయిడ్, మహిళలకు సంబంధించి వైద్యసేవలు అందిస్తారన్నారు.

600 మందికి వైద్య పరీక్షలు

రామాపురం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని గువ్వలచెరువు తెలుగు పాఠశాలలో ఆదివారం నూరా ఆల్ మబాఆరక్ చారిటబుల్ ట్రస్టు కడప ఆధ్వర్యంలో లైఫ్‌లైన్ హాస్పిటల్ డాక్టర్ షేక్ రబ్బాని, షేక్ ఇలియాస్‌బాషా, పఠాన్ అజ్మతుల్లాఖాన్ ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించారు. సుమారు మూడు గ్రామాల పరిధిలోని 1000 మందికిపైగా రోగులు హాజరైనట్లు ట్రస్టు సిబ్బంది తెలిపారు. 600 మందికి రక్త పరీక్షలు, స్కానింగ్ చేసి వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రామ్‌చరణ్‌రెడ్డి, హిమాం సాధిక్, ఆనంద్, సురేశ్‌కుమార్ పాల్గొన్నారు.

27 మందికి కంటి ఆపరేషన్లు

రాయచోటిటౌన్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణ పరిధిలోని చెన్నముక్కపల్లెలో ఉన్న లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం జరిగిన కంటి వైద్య శిబిరంలో 27 మందికి కంటి రోగులకు ఆపరేషన్లు నిర్వహించారు. ఈ సందర్భంగా రాయచోటి నియోజకవర్గంతో పాటు రాజంపేట, పీలేరు నియోజకవర్గ ప్రాంతాల నుండి వచ్చిన 55 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించిన వైద్యులు అందులో అర్హులైన 27 మందికి ఆపరేషన్లు నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ లయన్ చెన్నూరు అన్వర్‌బాషా, కంటి వైద్యులు సురేష్‌బాబు, భార్గవి, ఆప్తాల్మిక్ అసిస్టెంట్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన అసర్ల గంగమ్మ జాతర

గాలివీడు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బలిజపల్లి, నడింపల్లి మధ్య కుషావతి నదీ తీరాన వెలసిన అసర్ల గంగమ్మ జాతర ఆదివారం ఘనంగా ముగిసింది. తెల్లవారుజామున గ్రామంలోని మహిళలు భక్తి శ్రద్ధలతో అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం కల్లి పాటు కార్యక్రమంతో జాతర ముగిసింది.

ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం

● ఎస్‌ఐ మహ్మద్ రఫీ

సిద్దవటం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ రవాణా స్థావరాలపై ఉక్కుపాదం మోపుతామని ఎస్‌ఐ మహ్మద్‌రఫీ తెలిపారు. ఆదివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఎస్‌ఐ మాట్లాడుతూ గృహనిర్మాణాల అవసరాలకు మాత్రమే మండల పరిధిలోని గ్రామ నివాసులు ఇసుక ఉపయోగించుకోవాలని, ఉచిత ఇసుక విధానం ముసుగులో పెన్నా పరివాహక గ్రామాలైన మాచుపల్లె, డేగనవారిపల్లె, లింగంపల్లె, టక్కోలి గ్రామాల నుంచి ట్రాక్టర్లతో రవాణా జరుగుతున్నట్లు ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని, ఆ ప్రాంతాల్లో దాడులు నిర్వహించి ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతామని తెలిపారు. ఇప్పటికే కొన్ని స్థావరాలపై నిఘా వేసి ఉంచామని ఆయన తెలిపారు.

తప్పుడు కథనాలు ప్రచురించడం సబబు కాదు

● తెలుగు తమ్ముళ్ల ఆగ్రహం

సిద్దవటం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి గోశాలపై తప్పుడు కథనాలు ప్రచురించడం సబబు కాదని టీడీపీ మండల నాయకులు మండిపడ్డారు. ఆదివారం స్థానిక సిద్దవటం బస్టాండు కూడలిలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ మాజీ డైరెక్టర్ మల్లు వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యం సరిగాలేక వయస్సు పైబడిన గోవులు మృతిచెందితే విషపు రాతలు ప్రచురించడం సబబు కాదని, వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు హిందూ దేవాలయాలను ధ్వంసం చేశారని, ఆరోజు ఈ పత్రిక ఎందుకు రాయలేదో చెప్పాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ పార్లమెంట్ కార్యదర్శి నాగమునిరెడ్డి, సీనియర్ నేత చెంచయ్యనాయుడు, బీసీ సెల్ కార్యదర్శి రాజశేఖర్, అసెంబ్లి అధికార ప్రతినిధి రామ్మోహన్‌నాయుడు, మాజీ డీలర్ జ్యోతి వెంకటసుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉత్తమ ఫలితాలు



సాయి కీర్తన్

నందలూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ బోర్డు ప్రకటించిన పరీక్ష ఫలితాల్లో తమ విద్యార్థులు మంచి ప్రగతి సాధించినట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీదేవి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో పి.సాయి కీర్తన్ 957 మార్కులు, అంజలి 886, ఆజ్ఞ చక్రాంత 885, బైపీసీ విభాగంలో భావన 874, సునీత 840, సీఈసీలో ఎస్.షమీరా 835 మార్కులతో విజయఢంకా మోగించారన్నారు. అలాగే ప్రథమ సంవత్సరం ఫలితాల్లో వై.మల్లీశ్వరి సీఈసీలో 500కు 409 మార్కులు, బైపీసీ విభాగంలో ఎ.బంగారం 440 మార్కులకు 348 మార్కులు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను, అధ్యాపక బృందాన్ని ఆమె అభినందించారు.

కేజీబీవీ విద్యార్థినుల వందశాతం ఉత్తీర్ణత



మనీషా



సాయికీర్తన

లక్కిరెడ్డిపల్లె, ఏప్రిల్13 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షా ఫలితాల్లో లక్కిరెడ్డిపల్లె కస్తూర్బా పాఠశాల విద్యార్థినులు వందశాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ నాగలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం నుంచి 19 మంది పరీక్షలు రాయగా అందరూ ఉత్తీర్ణత సాధించారన్నారు. వీరిలో బి.మనీషా 1000 మార్కులకు 884 మార్కులు, కె.భార్గవి 876, సునీత 864 మార్కులు సాధించారని తెలిపారు. అలాగే ప్రథమ సంవత్సరంలో సాయికీర్తన 440 మార్కులకు 429 మార్కులు సాధించిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులను, అధ్యాపలకులు శ్వేత, మారతమ్మ, శివజ్యోతి, పద్మజ, గురుదీప్తి, గంగాదేవిలను ప్రిన్సిపాల్ అభినందించారు.

మానవతకు రూ.50 వేల విరాళం



మానవత సభ్యులకు నగదు అందజేస్తున్న సాయితేజయాదవ్

లక్కిరెడ్డిపల్లె, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): నిరుపేదలు, విద్యార్థులకు, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి సేవలందిస్తున్న మానవతా సేవాసంస్థకు ఏపీ ఎన్జీవో రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.ప్రసాద్‌యాదవ్ కుమారుడు వెంకటసాయితేజ యాదవ్ రూ.50 వేల విరాళాన్ని అందించారు. ఈ మేరకు ఆయన ఆదివారం సంస్థ ఛైర్మన్ బాలసుబ్రమణ్యం, మండల అధ్యక్షుడు డాక్టర్ షఫీనాయక్‌లకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మానవతా సంస్థ రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో మంది నిరుపేదలను ఆదుకుంటూ సేవలు అందిస్తున్నదని కొనియాడారు. కార్యక్రమంలో కోఛైర్మన్ శివశంకర్‌రెడ్డి, శివయ్య, జిల్లా నాయకులు కృష్ణ, చైతన్యరెడ్డి, కోశాధికారి రవిశంకర్, డైరెక్టర్ రమణరావు తదితరులు పాల్గొన్నారు.

సిద్దవటం కోటను సందర్శించిన డిప్యూటీ సీఈవో

సిద్దవటం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన సిద్దవటం పురావస్తుశాఖ పరిధిలో ఉన్న కోటను ఆదివారం కడప డిప్యూటీ సీఈవో వెంకటేశ్వర్‌రావు సందర్శించారు. కోటలోని మొదటి మండపం, రెండో మండపం, రాణి మహల్, శిలాశాసనాలు, మీనాక్షి ఆలయం, కోనేరు, పార్కులు, రాణి స్నానపు వాటిక, పురాతనమైన మసీదు తవ్వకాల్లో బయటపడ్డ శివలింగాలు, పురాతనమైన శిల్పాలపై సిబ్బందిని అడిగి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఈవో మాట్లాడుతూ పురాతనమైన కోటలో మరపురాని శిల్పాలు, శాసనాలు ఎన్నో కట్టడాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో వీఆర్వో కేశవులు, వీఆర్‌ఏ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కొలిమివీధిలో సీతారాముల కల్యాణం

రాజంపేట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): రాజంపేట పట్టణం కొలిమివీధిలో వెలసిన కోదండరామాలయంలో సోమవారం అంగరంగ వైభవంగా సీతారాముల కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కల్యాణం అనంతరం అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే 15వ తేదీన సాయంత్రం స్వామివార్లకు ఏకాంతసేవ ఉంటుందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని కమిటీ సభ్యులు కోరారు.

బొమ్మవరం శివాలయ ప్రతిష్ఠకు కంచి పిఠాధిపతి హాజరు

ఓబులవారిపల్లె, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బొమ్మవరం గ్రామంలో పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరాలయం పునర్నిర్మాణ మహోత్సవంలో భాగంగా కుంభాభిషేకం కార్యక్రమానికి కంచి పీఠాధిపతి శంకర విజయేంద్రసరస్వతిస్వామి హాజరై పూజలు నిర్వహించారు. నాలుగు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాలతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. రాత్రి వేళల్లో భరతనాట్యం, చెక్కభజన కార్యక్రమాలతో సందడి నెలకొంది. పూజా కార్యక్రమంలో భాగంగా పలువురు రాజకీయ ప్రముఖులు హాజరై నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతం

సంబేపల్లె, ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి): కంటి ఆపరేషన్‌లతో కంటి చూపును ప్రసాదించడం పేదవారి జీవితాల్లో వెలుగులు నింపడమేనని విశ్రాంత డీఎస్పీ వెంకటనాథరెడ్డి, శ్రీసిటీ జనరల్ మేనేజర్ రామచంద్రారెడ్డి, అమర్‌నాథరెడ్డి తెలిపారు. ఆదివారం సంబేపల్లె మండలం మోటకట్ల గ్రామం వంగిమళ్లవాండ్లపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పలవుల సుబ్బారెడ్డి, వాసుదేవమ్మ దంపతుల స్మారకార్థం తిరుపతి ఎస్వీ అరవింద్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. కంటి వైద్య నిపుణులు డాక్టర్ ప్రియాంక, డాక్టర్ ఆకాంక్ష, 12 మంది వైద్య సిబ్బందితో 132 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. అందులో 40 మందిని శస్త్ర చికిత్సకు ఎంపిక చేసి ఉచిత ఆపరేషన్‌లతో పాటు రవాణా సౌకర్యం కల్పించామని విశ్రాంత డీఎస్పీ తెలిపారు. ఆపరేషన్ అనంతరం మంగళవారం వారి స్వగృహాలకు చేర్చుతామన్నారు. కార్యక్రమంలో హాస్పిటల్స్ సిబ్బంది, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో.. రూ.25 కోట్లు కొల్లగొట్టారు..!





- నయామోసాలకు పాల్పడుతున్న సైబర్ నేరగాళ్లు
- మోసపోయిన వారిలో ఎక్కువగా ఉద్యోగులు, విద్యావంతులు
- 13 నెలల్లో 1,201 ఫిర్యాదులు

వెయ్యికి 2వేలు, 2వేలకు 4వేలు అంటూ సోషల్ మీడియా గ్రూపుల్లో వచ్చే ప్రకటనలకు కొంతమంది ఆశపడి డబ్బులు పెడతారు. ఆశ కాస్త అత్యాశగా మారడంతో లక్షలు, కోట్ల రూపాయలు పెట్టుబడులు పెట్టి సైబర్ నేరగాళ్లకు చిక్కి మోసపోతున్నారు. ఇటీవల ఆన్‌లైన్ పెట్టుబడి మోసాల కేసులు పెరుగుతున్నాయి. ఆన్‌లైన్ ట్రేడింగ్ ఇన్వెస్ట్‌మెంటు పేరుతో సైబర్ మోసగాళ్లు సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తూ డబ్బులు ఈజీగా కొట్టేస్తున్నారు. జిల్లాలో 13 నెలల్లో 1,201 ఫిర్యాదులు రాగా, రూ.25కోట్లకు పైగానే బాధితులు పోగొట్టుకున్నారు.

కడపక్రైం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఇప్పుడు ఆండ్రాయిడ్ మొబైల్ వినియోగిస్తున్నారు. ఇప్పుడున్న టెక్నాలజీతో ఏదో ఒక ఆశ చూపించి కష్టపడకుండానే సైబర్ నేరగాళ్లు డబ్బులు లాగేస్తున్నారు. ఇటీవల ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో కోట్లు కొల్లగొట్టారు. సైబర్ నేరగాళ్ల మాటలు నమ్మి డబ్బు ఇన్వెస్ట్ చేసిన వారిలో డాక్టర్లు, ఇంజనీర్లతో పాటు బీటెక్ విద్యార్థులు ఉండటం విశేషం. వీరికి ఇన్వెస్ట్‌మెంట్‌లపై అవగాహన ఉన్నప్పటికీ రూ.కోట్లు సంపాదించాలనే ఆశతో పెట్టుబడులు పెడుతున్నారు. అధిక లాభాలు వస్తాయంటూ షేర్ మార్కెట్లపై కొన్ని వాట్సప్ గ్రూపుల్లో పేర్లతో సహా ప్రతిరోజూ ప్రకటనలు వస్తున్నాయి. ఈ ప్రకటనలు చూసి అత్యాశతో ఎవరైనా స్పందిస్తే మాత్రం వారి ఖాతా ఖాళీ కావాల్సిందే. ఒక్కసారి వారి ఉచ్చులో పడితే భయపెట్టడంతో పాటు సైబర్ నేరగాళ్ల బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతున్నారు.

జిల్లాలో కొందరు బాధితులు

- కడపకు చెందిన ఓ డాక్టరు ట్రేడింగ్, స్టాక్‌మార్కెట్‌లో రూ.3కోట్లకు పైగా పెట్టుబడి పెట్టాడు. ఆయనకు ఒక్క రూపాయి కూడా రాకపోవడంతో మోసపోయానని గుర్తించి లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించాడు.
- మైదుకూరు వాసి అయిన కానిస్టేబుల్ ప్రస్తుతం వేరే జిల్లాలో పనిచేస్తున్నాడు. స్టాక్ మార్కెట్‌లో అధిక లాభాలు వస్తాయంటూ అతనితో పాటు స్నేహితులు, తోటి ఉద్యోగులతో దాదాపు రూ.3కోట్లకు పైగానే పెట్టుబడులు పెట్టించాడు. వీళ్ల డబ్బులు పెట్టడమే కానీ తిరిగి రాలేదు. దీంతో బాధితులంతా ఆ కానిస్టేబుల్‌పై వత్తిడి తెస్తున్నారు. ఆయన స్పందించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.
- కమలాపురానికి చెందిన ఓ వ్యక్తి చుట్టుపక్కల గ్రామాలకు చెందినవారికి స్టాక్‌మార్కెట్‌పై అవగాహన కల్పించి వారితో లక్షలకు లక్షలు పెట్టుబడులు పెట్టించాడు. తాము కట్టిన డబ్బులు తిరిగి ఇవ్వాలని ఇటీవల వారు కోరినప్పటికీ అతను సరిగా స్పందించకపోవడంతో బాధితులందరూ పోలీసులను ఆశ్రయించారు.
- స్టాక్‌మార్కెట్లో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయి, దీంతో ఉద్యోగాలు కూడా అవసరం లేదనే భావనతో కడపకు చెందిన బీటెక్ చదివిన ఓ యువకుడు లక్షల్లో పెట్టుబడి పెట్టాడు. మొదట బాగున్నా తరువాత ఆ స్టాక్‌మార్కెట్ బోర్డు తిప్పేశారు. ఇతనూ పోలీసులను ఆశ్రయించాడు.

స్టాక్‌మార్కెట్‌లో పెట్టుబడులు

చాలా మంది ఉద్యోగులు, విద్యావంతులు సెల్‌ఫోన్‌లో ఇన్‌స్టాగ్రామ్, వాట్సప్ తదితర సోషల్ మీడియాల్లో వచ్చే ట్రేడింగ్ ప్రకటనలకు స్పందిస్తున్నారు. మొదట స్వల్పంగా పెట్టుబడి పెడితే తిరిగి రెట్టింపు ఇస్తారు. దీంతో వారికి ఆశ పెరిగి పోతుండడంతో పెట్టుబడి లక్షలు, కోట్ల రూపాయలకు చేరుతోంది. సైబర్ నేరగాళ్లు వారి టార్గెట్ రీచ్ కాగానే బోర్డు తిప్పేస్తున్నారు. దీంతో బాధితులకు కమ్యూనికేషన్ లేకపోవడం, ఎవరిని అడగాలో తెలియక చివరికి పోలీసులను ఆశ్రయిస్తున్నారు. పోలీసులు కూడా బాధితుల ఫిర్యాదు తీసుకుని విచారిస్తుండగా తప్పుడు చిరునామాలతో ఈ స్టాక్‌మార్కెట్‌ను క్రియేట్ చేస్తున్నట్లు గుర్తిస్తున్నారు. ఈ స్కామ్‌లో ఎవరున్నారు, మనీ ట్రాన్స్‌ఫర్ ఎలా జరిగిందన్నదానిపై ఆరా తీసినప్పటికీ విచారణ కొంతవరకు సాగినా చివరికి ఇతర రాష్ట్రాలు, దేశాలవరకు ఈ నేరగాళ్ల లింకులు ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో సైబర్ నేరగాళ్లను పట్టుకోవాలన్నా పోలీసులకు కష్టసాధ్యంగా మారుతోంది. అత్యధిక లాభాలు వస్తాయంటూ ఆశచూపే చోట పెట్టే పెట్టుబడులతో పోయేదే కానీ వచ్చేదేమీ ఉండదు. అయినా సరే జనాల్లోని ఆశను సైబర్ నేరగాళ్లు ఆయుధంగా మలచుకుంటూ చాకచక్యంగా సొమ్ము దోచేస్తున్నారు.



ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

సోషల్ మీడియాలో వచ్చే ప్రకటనలపై ఎవరూ స్పందించవద్దు. పెట్టుబడులకు రెండింతలు ఇస్తామంటే ఎవరైనా ఆశపడి డబ్బు పెట్టారంటే చివరికి ఒక్కరూపాయి కూడా రాదు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఇలాంటి ప్రకటనలతో మిమ్మల్ని మోసం చేసి సైబర్ నేరగాళ్ల డబ్బులు స్వాహా చేస్తున్నారు. ఎవరైనా డబ్బులు పోగొట్టుకుంటే తక్షణమే సైబర్ సెల్‌లో సంబంధిత పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి. లేదా 1930కి కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. అలాగే సైబర్‌నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

- మధుమల్లేశ్వర్‌రెడ్డి, సీఐ, సైబర్ సెల్

ప్రాణం తీసిన ఈత సరదా..

- చెరువులో మునిగి విద్యార్థి మృతి



ఈతకు వెళ్లి మృతిచెందిన భాస్కర

పెద్దమండ్యం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): స్నేహితుడి స్వగ్రామంలో జాతర చూసేందుకు వెళ్లిన ఓ విద్యార్థి ప్రాణాలను ఈత సరదా బలి తీసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పెద్దమండ్యం మండలం కలిచెర్లకు చెందిన కేశవరెడ్డి కుమారుడు అరవింద్ కుమార్‌రెడ్డి, తంబళ్లపల్లి మండలం కోసువారిపల్లికి చెందిన రాజశేఖర్‌రెడ్డి, పీటీఎం మండలం బోర్లపల్లి గ్రామ పంచాయతీ పిడుమువారిపల్లికి చెందిన రెడ్డప్ప కుమారుడు భాస్కర ఇటీవలే పదో తరగతి పరీక్షలు రాశారు. పాలిటెక్నిక్ ఎంట్రెన్స్ కోసం మదనపల్లిలోని ఓ కోచింగ్ సెంటర్‌లో చేరారు. వీరి మధ్య స్నేహం కుదిరింది. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం అరవింద్‌తో కలసి ఇద్దరూ కలిచెర్ల పోలేరమ్మ తిరునాళ్లకు వచ్చారు. ఆదివారం గ్రామ సమీపంలోని పాపిరెడ్డిచెరువులోకి ఈతకు వెళ్లారు. ఈత కొడుతూ భాస్కర చెరువు నీటిలో మునిగిపోయాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు చెరువు వద్దకు వెళ్లి అతనిని వెలికి తీసే సరికే మృతి చెందాడు. ఈ సంఘటనతో గ్రామంలో విషాదం అలుముకుంది. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు గోడుగోడున విలపించారు. సంఘటన స్థలాన్ని పెద్దమండ్యం పోలీసులు పరిశీ లించారు.. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దమండ్యం ఎస్ఐ పీవీ రమణ తెలిపారు. మృతదేహాన్ని మదనపల్లి జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు వివరించారు.

రెండు స్కూటర్లు ఢీ.. మహిళ మృతి

- తండ్రీ కుమారుడికి తీవ్రగాయాలు



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గులాబ్‌జాన్

రామాపురం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కర్నూలు-చిత్తూరు 40వ జాతీయ రహదారి లోని రామాపురం మండలం బండపల్లి గ్రామం వీఆర్ పాఠశాల సమీపంలో ఆదివారం తెల్లవారుజామున రెండు స్కూటర్లు ఢీకొని షేక్ గులాబ్జాన్ (45) అనే మహిళ మృతి చెందగా తండ్రీకొడుకు గౌస్‌మోద్దీన్, మహమ్మద్ అనాస్‌లకు తీవ్ర గాయాలైనట్లు ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డి తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. రామాపురం మండలం వెంకటరెడ్డిగారిపల్లెకు చెందిన షేక్ గౌస్‌మోద్దీన్, ఆయన భార్య షేక్ గులాబ్జాన్, కుమారుడు మహమ్మద్‌అనాస్ రాయచోటికి వెళ్లి తిరిగి ఏపీ04 ఏబీ 3151 నెంబరు గల ఎక్స్‌ఎల్ స్కూటర్‌లో ఇంటికి వస్తున్నారు. వీఆర్ స్కూల్ సమీపంలోని పెట్రోల్ బంక్ వద్దకు రాగానే రాయచోటి నుంచి కడపకు వెళ్తున్న మోటారు సైకిల్ రాయల్ ఎన్‌ఫీల్డ్ ఏపీ40 ఎఫ్‌సీ7187 నడుపుతున్న వ్యక్తి అతివేగంగా వచ్చి ముందు వెళ్తున్న స్కూటర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ముగ్గురూ కిందపడిపోవడంతో తీవ్రగాయాలయ్యాయి. సంఘటన స్థలానికి రామాపురం పోలీసులు చేరుకొని గాయపడిన వారిని 108 అంబులెన్స్‌లో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా షేక్ గులాబ్‌జాన్ పరిస్థితి విషమించడంతో కడప రిమ్స్‌కు తరలించగా మార్గమధ్యంలో ఆమె మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయురాలు..

- భర్త, కుమార్తెకు గాయాలు
- కూతురి పరిస్థితి విషమం



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఉపాధ్యాయురాలు

మదనపల్లెఅర్బన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ ఉపాధ్యాయురాలు మృతిచెందగా, ఆమె భర్త, కూతురు తీవ్రంగా గాయపడ్డారు. అన్నమయ్య జిల్లా, కలకడ మండలానికి చెందిన శారద (40) కదిరిలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తుండగా, ఆమె భర్త వెంకటరమణ ములకచెరువు మండలం, సోంపాలెంలో ఉపాధ్యాయుడుగా పని చేస్తున్నాడు. వీరి కుమార్తె కీర్తి విజయవాడలో ఇంటర్ చదువుతోంది. ఇంటర్ ఫలితాల విడుదల సందర్భంగా శనివారం విజయవాడకు వెళ్లిన వారు, అక్కడి నుంచి కారులో తిరువణ్ణామలైకి వెళ్లారు. అక్కడి నుంచి కదిరికి వెళుతుండగా, ఆదివారం ఉదయం పుంగనూరు మండలం, సుగాలిమిట్ట వద్ద వీరు ప్రయాణిస్తున్న కారును ఐషర్ వాహనం ఢీకొంది. దీంతో ముగ్గురూ తీవ్రంగా గాయపడగా, స్థానికులు వారిని మదనపల్లెలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శారద మృతిచెందగా, వెంకటరమణ, కీర్తిని బెంగుళూరులోని మణిపాల్ ఆస్పత్రికి తరలించారు. కీర్తి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ఈ మేరకు పుంగనూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బంగారు దుకాణంలో చోరీ

- 4 కేజీల వెండి
- 20 గ్రాములు బంగారు చోరీ



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఖాజీపేట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఖాజీపేట నడిబొడ్డున ఉన్న వీఎస్ జ్యువెలరీ షాపులో ఆదివారం తెల్లవారుజామున దుకాణానికి ఉన్న తాళం పగులకొట్టి లోనికి ప్రవేశించి అందులో ఉన్న నాలుగు కేజీల వెండి, 20 గ్రాముల బంగారం తీసుకెళ్లారని పోలీ సులు తెలిపారు. వారు సీసీ కెమెరాలను గుర్తించకుండా చోరీకి పాల్పడడంతో రికార్డు అయింది. ఇందులో ముగ్గురు వ్యక్తులు ఈ చోరీకి పాల్పడినట్లు బయటపడింది. విషయం తెలుసుకున్న సీఐ మోహన్ సంఘటనా స్థలానికి చేరుకుని క్లూస్ టీంను తెప్పించి పరిశీలించారు. దుకాణ యజమాని షేక్ వహీద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఘాట్ రోడ్డులో లారీ టైర్లు దగ్ధం



కాలిపోతున్న కోళ్ల దాణా లారీ

రామాపురం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కర్నూలు-చిత్తూరు 40వ జాతీయ రహదారిలోని రామాపురం మండలం గువ్వలచెరువు ఘాట్ రెండో మలుపు వద్ద ఆదివారం కోళ్ల దాణా తీసుకువెళ్తున్న లారీ టైర్లు దగ్ధమయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. కడప నుంచి కోళ్ల దాణా చిత్తూరుకు తీసుకువెళ్తున్న ఏపీ39 ఉక్ 8371 గల లారీ గువ్వలచెరువు రెండో ఘాటు వద్ద రాగానే టైర్లకు మంటలు అంటుకున్నాయి. గమనించిన లారీ డ్రైవర్ లారీని ఆపి కిందకు దిగాడు. స్థానికుల సహాయంతో లక్కిరెడ్డిపల్లె అగ్నిమాపక కేంద్రానికి ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించి అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

టీడీపీ వర్గీయులపై వైసీపీ దాడి

- కృష్ణాపురం ఘటనపై వేగంగా స్పందించిన పోలీసులు
- ఇరువురు వైసీపీ వర్గీయుల అరెస్ట్
- ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ

రాయచోటిటౌన్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య-చిత్తూరు జిల్లాల సరిహద్దు ప్రాంతంలోని పుంగనూరు మండల కృష్ణాపురం గ్రామానికి చెందిన టీడీపీ సానుభూతి పరులపై వైసీపీ సానుభూతి పరులు భూమి వివాద విషయంగా దాడి చేసి గాయపర్చినట్లు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న విషయంపై ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు వేగంగా స్పందించి ప్రత్యేక టీంలను ఏర్పాటు చేశారు. దాడికి పాల్పడిన వేణుగోపాల్, భరత్‌లను ఆదివారం అరెస్టు చేసి కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను ఆదివారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు మీడియాకు వెల్లడించారు. జిల్లా పరిధిలోని నిమ్మనపల్లి మండలం, బండ్లపై గ్రామ పంచాయతీలోని జాండ్ర బైలులో నివాసం ఉంటున్న మల్లంపల్లి రామస్వామికి పుంగనూరు మండలం చెండ్రమాకులపల్లి పంచాయతీలోని కృష్ణాపురం వద్ద సర్వే నెంబర్ 740(4)లో 3.05 ఎకరాల భూమి ఉందన్నారు. రామస్వామికి నలుగురు కుమారులు కాగా వరుసగా వేణుగోపాల్, హరినాథ్, మోహన్, మల్లికార్జునలకు వివాహాలయ్యాయన్నారు. వీరిలో వేణుగోపాల్, మల్లికార్జునలు జాండ్రబైలులో కాపురం ఉంటుండగా హరినాథ్ పుంగనూరు మండలం చెండ్రమాకులపల్లి పంచాయతీలోని కృష్ణాపురంలో కాపురం ఉంటున్నాడని తెలిపారు. మోహన్ దుబాయ్‌లో ఉంటున్నాడన్నారు. అయితే రామస్వామికి సంబంధించిన భూమిలో పెద్ద కుమారుడు వేణుగోపాల్, రెండో కుమారుడు హరినాథ్ ప్రస్తుతం వ్యవసాయం చేసుకుంటూ ఉన్నారన్నారు. వీరిలో వేణుగోపాల్ వైసీపీ సానుభూతిపరులు కాగా హరినాథ్ టీడీపీ సానుభూతిపరులుగా ఉన్నారని తెలిపారు. ఈ క్రమంలో ఈ నెల 12న శనివారం మధ్యాహ్నం వేణుగోపాల్ కొడుకు భరత్ సదరు పొలం దగ్గరికి వెళ్తుండగా హరినాథ్ కుమారుడు వెంకటేశ్ ఈ దారిలో నడవద్దని చెప్పడంతో గొడవ జరిగిందన్నారు. భరత్ అంతటితో అక్కడి నుంచి వెళ్లిపోయి తిరిగి సాయంత్రం అతని భార్యతో కలిసి సదరు పొలం దగ్గరికి వెళ్తుండగా అక్కడ ఉన్న హరినాథ్, అతని కుమారుడు వెంకటేశ్‌లు ఘర్షణ పడ్డారు. ఇందులో హరినాథ్, వెంకటేశ్‌ను పక్కనే ఉన్న టమోటా సీడ్ కట్టెలతో భరత్ దాడి చేయడంతో రక్తగాయాలయ్యాయన్నారు. భరత్‌కు కూడా చిన్నచిన్న గాయాలయ్యాయన్నారు. ఈ విషయమై హరినాథ్, అతని కుమారుడు వెంకటేశ్ పుంగనూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. భూమికి సంబంధించిన సమస్యలు, ఇతర సమస్యలు ఉంటే వాటిని చట్టబద్ధంగా, న్యాయబద్ధంగా పరిష్కరించుకోవాలని, వ్యక్తిగత కక్షలు పెంచుకుని వర్గాలు, గ్రూపులుగా ఏర్పడి ప్రజాశాంతికి విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

వృద్ధురాలి హత్య కేసును తప్పుదోవ పట్టిస్తున్నారు

- న్యాయం చేయాలని కుటుంబ సభ్యుల ఆందోళన
- ఎమ్మెల్యే చొరవతో సర్దుబాటు
- నగలు, నగదు విషయం ఎఫ్ఐఆర్‌లో చేర్చాలని ఆదేశం



బెంగళూరు రోడ్డులో బైఠాయించి నిరసన చేస్తున్న బాధితులు

మదనపల్లెఅర్బన్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): హత్యకు గురైన వృద్ధురాలి మెడలో ఉన్న నగలు, ఆమె వద్ద ఉన్న రూ.రెండు లక్షల నగదు విషయం వెంటనే తేల్చాలని ఎమ్మెల్యే షాజహాన్ బాషా పోలీసు అధికారులను ఆదేశించారు. గంగులమ్మ అనే వృద్ధురాలిని విష్ణు అనే ఆటో డ్రైవర్ హత్య చేసి, ప్రమాదంగా చిత్రీకరించాలని ప్రయత్నించిన విషయం తెలిసిందే. ఈ విషయంలో తమకు న్యాయం చేయాలంటూ హతురాలి కుటుంబసభ్యులు, బంధువులు సుమారు 200 మంది ఆదివారం ఉదయం తాలూకా పోలీస్‌స్టేషన్ సమీపంలోని బెంగళూరు జాతీయ రహదారిపై బైఠాయించి ఆందోళన చేశారు. రూయా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తమ పెద్దమ్మ కుమారుడు వెంకటరమణకు డబ్బు అవసరం కావడంతో, అతనికి ఇచ్చేందుకు రూ.2 లక్షలు తీసుకని ఇంటి నుంచి బయలుదేరిందని ఆమె కుమారులు తెలిపారు. ఆర్టీసీ బస్టాండుకు వెళ్లేందుకు చంద్రాకాలనీలో ఆటో ఎక్కిందని వివరించారు. అయితే, ఆటో డ్రైవర్ సీఎస్ఐ చర్చి వద్ద దింపాడని, ఐదు రూపాయలు విషయంలో గొడవపడినట్లు పోలీసులు కట్టుకథ అల్లుతున్నారని బాధితులు ఆరోపించారు. ఐదు రూపాయల కోసం హత్య చేసినట్లు పోలీసులు ఎఫ్ఐఆర్ చూపడం తప్పన్నారు. తమకు న్యాయం చేయకపోతే ఆత్మహత్య చేసుకుంటానంటూ గంగులమ్మ మనుమడు మనోహర్ ఒంటిపై పెట్రోల్ పోసుకోవడంతో పోలీసులు, కుటుంబసభ్యులు అడ్డుకున్నారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే షాజహాన్ బాషా అక్కడికి చేరుకుని బాధితులకు అండగా ఉంటామని చెప్పడంతో వారు ఆందోళన విరమించారు. ఎమ్మెల్యే బాధితులతో పాటు పోలీస్‌స్టేషన్ వద్దకు వచ్చి బాధితుల ఫిర్యాదును, పోలీసులు నమోదు చేసిన ఫిర్యాదులోని వివరాలను ఎస్ఐ గాయత్రితో చదివించారు. ఎఫ్ఐఆర్‌లో గంగులమ్మ మెడలో ఉన్న నగలు, రెండు లక్షలు క్యాష్ విషయం లేదని, వెంటనే చేర్చి దర్యాప్తు చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని మృతదేహాన్ని పరిశీలించి శ్రద్ధాంజలి ఘటించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బాధితులకు అప్పగించారు. రూరల్ సీఐ సత్యనారాయణ, టూటౌన్ సీఐ రామచంద్ర, టీడీపీ నాయకులు హరిబాబు, చెండ్రాయులు, గురునాథ్, బాబా పాల్గొన్నారు.

చెన్నూరు ఎస్‌బీఐలో చోరీకి విఫలయత్నం

చెన్నూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు ఎస్‌బీఐలో గుర్తు తెలియని వ్యక్తులు షట్టర్ తాళాలు పగలగొట్టి లోపలికి ప్రవేశించి బ్యాంకు సేఫ్ లాకర్లను బలవంతంగా ఓపెన్ చేసేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. బ్యాంకులో బయటి వైపు ఉన్న సీసీ కెమెరాల వైర్లు కట్ చేసి సీసీ ఫుటేజీ (డీవీఆర్) తీసుకెళ్లారు. అంతేకాక బ్యాంకు క్లోజింగ్ బ్యాలెన్స్ అమౌంటు సుమారు రూ.20వేలు చోరీ చేశారు. ఆదివారం సాయంత్రం బ్యాంకులో పనిచేసే మెసెంజరు లైటు వెలగకపోవడంతో ఈ విషయం బ్యాంకు సిబ్బందికి తెలిపారు. వారు పోలీసు సిబ్బందికి సమాచారం తెలిపారు. బ్యాంకు మేనేజరు సుజిత ఈ విషయాన్ని పై అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్థానిక సీఐ, డీఎస్పీ వెంకటేశ్వరరావు, తాలుకా సీఐ వెంకటేశ్వర్లు, క్లూస్‌టీం సిబ్బంది బ్యాంకు పరిసరాలను గమనించారు. ఈ విషయంపై కడప డీఎస్పీ మాట్లాడుతూ దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

మెడికల్ ఏజన్సీలో చోరీ

రూ.1.21 లక్షలు అపహరణ

కడపక్రైం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కడప నగరం బీకేఎం వీధిలో ఈశ్వర్ మెడికల్ ఏజన్సీలో దొంగలు నగదును అపహరించినట్లు కడప టూటౌన్ ఎస్ఐ హుసేన్ తెలిపారు. ఆయన వివరాల మేరకు కడపకు చెందిన శివకుమార్ ఈ నెల 11న రాత్రి ఏజన్సీ మూసి ఇంటికి వెళ్లాడు. తిరిగి ఉదయం వచ్చి చూసేసరికి దొంగలు ఏజన్సీ షట్టరు పగలగొట్టి రూ.1.21 లక్షల నగదును అపహరించినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

ఉరి వేసుకుని వృద్ధుడు మృతి

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ఒంటరితనం భరించలేక ఉరి వేసుకుని ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ ఎరిసావలి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు పట్టణంలోని ఉమ్మర్ మసీదు దగ్గర నివాసం ఉన్న సయ్యద్ జోహర్ హుసేన్ (70) భార్య షాహిదా, కుమారులు జాకీర్‌హుసేన్, షాకీర్ హుసేన్, జావీద్ హుసేన్ ముంబైలో స్థిరపడగా, అతను మాత్రం మదనపల్లెలోని సొంత ఇంట్లో ఒంటరిగా ఉంటున్నాడు. వారం రోజుల క్రితం అతని భార్య షాహిదా మదనపల్లికి వచ్చినా, ఇంట్లో ఉండకుండా పోతబోలులోని బంధువుల ఇంటికి వెళ్లింది. భర్తను కూడా అక్కడికే రమ్మని కోరింది. అయితే, అక్కడికి వెళ్లేందుకు ఇష్టపడని జోహర్ హుసేన్ ఆదివారం ఉదయం ఉరి వేసుకుని మేడపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు భార్య ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

తెలుగు తమ్ముళ్ల బాహాబాహీ..!

- రణరంగంలా తంబళ్లపల్లె కార్యకర్తల సమావేశం
- ఇన్‌చార్జి మంత్రి ఎదుటే ఇరువర్గాల ఘర్షణ
- దూషణలు.. పిడిగుద్దులు.. సవాళ్లు
- జోన్‌ఫోర్ ఇన్‌చార్జి దీపక్‌రెడ్డికి స్వల్ప గాయాలు
- సమావేశాన్ని అర్ధాంతరంగా ఆపేసిన మంత్రి



దీపక్‌రెడ్డి ని జాగ్రత్తగా తీసుకెళుతున్న కట్టా దొరస్వామినాయుడు, గన్‌మన్



సమావేశ మందిరం బయట కార్యకర్తలను చెదరగొడుతున్న పోలీసులు (ఇన్‌సర్ట్) సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి మంత్రి జనార్దన్ రెడ్డి

బి.కొత్తకోట, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): సవాళ్లు, ప్రతి సవాళ్లు, దూషణలు, ముష్టిఘాతాల నడుమ మండలంలోని హార్సిలీహిల్స్‌లో ఆదివారం అన్నమయ్య జిల్లా ఇన్చార్జి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ కార్యకర్తల సమావేశం రణరంగంగా మారింది. దీంతో అర్ధాంతరంగా కార్యక్రమాన్ని రద్దు చేసుకొని మంత్రి తిరుగుముఖం పట్టారు. నియోజకవర్గంలో పరిస్థితిని చక్కదిద్దడానికి వస్తే కార్యకర్తలు విచక్షణ కోల్పోయి ప్రవర్తించారంటూ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

ములకలచెరువు నుంచి హార్సిలీహిల్స్‌కు..

తంబళ్లపల్లె నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం ములకలచెరువు మార్కెట్‌యార్డ్‌లో నిర్వహిస్తున్నట్లు తొలుత ప్రకటించారు. అయితే ప్రస్తుత ఇన్చార్జి జయచంద్రారెడ్డికి అనుకూల, వ్యతిరేక వర్గాలుగా టీడీపీ కార్యకర్తలు విడిపోయిన నేపథ్యంలో సమావేశాన్ని హార్సిలీహిల్స్‌కు మార్చారు. మండల కన్వీనర్లు, క్లస్టర్ ఇన్చార్జిలు, జిల్లా, రాష్ట్ర పార్టీ అనుబంధ విభాగాల్లో పదవులలో ఉన్నవారు మాత్రమే సమావేశానికి హాజరయ్యేలా చర్యలు తీసుకున్నారు. దీనికి తోడు ఆదివారం ఉదయం కొండ మీదకు ఎవ్వరినీ అనుమతించకుండా దిగువనే పోలీసులు అడ్డుకున్నారు. కొద్దిసేపటి తర్వాత మంత్రి ఆదేశాలతో అందరినీ అనుమతించారు.

గవర్నర్ బంగ్లా నుంచి వీఎస్‌ఆర్ గ్రాండ్ కు..

శనివారం రాత్రి హిల్స్‌కు చేరుకొని గవర్నర్ బంగ్లాలో విడిది చేసిన మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి ఇన్చార్జి జయచంద్రారెడ్డి, రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి పర్వీన్‌తాజ్ పుష్పగుచ్చాలు ఇచ్చి స్వాగతం పలికారు. మాజీ ఎమ్మెల్యే శంకర్ వర్గీయులతో మాట్లాడి, వారి వాదన విన్నాక, మీతో మాట్లాడతానని చెప్పి మంత్రి ప్రైవేట్ రెస్టారెంట్‌కు బయలుదేరారు. దీంతో జయచంద్రారెడ్డి గవర్నర్ బంగ్లా లోనే ఉండిపోయారు. ఆదివారం ఉదయం సమావేశ ప్రారంభంలో మంత్రి మాట్లాడుతూ టీడీపీలో గ్రూపులకు తావులేదన్నారు. కార్యకర్తల కోసమే ఇక్కడికి వచ్చాం.. మీరు ఏం చెప్ప దలచుకున్నా, ఆధారాలతో సహా రాత పూర్వకంగా ఇవ్వండి. పార్టీ ఆఫీసు ఆదేశాల మేరకే అంతా జరుగుతుంది. టీడీపీ వైసీపీ లాంటి పార్టీ కాదు. క్రమశిక్షణ ముఖ్యం. ఇక్కడ జరిగింది అధినేత దృష్టికి వెళుతుందని తెలియజేశారు. మండలాల వారీగా కార్యకర్తలు తమ వివరాలు ఇచ్చి సమస్యను చెపితే, వారిని విజయవాడకు రప్పించి మాట్లాడతామన్నారు.తొలుత పెద్దమండ్యం, ఆ తర్వాత తంబళ్లపల్లె మండలాల కార్యకర్తలను లోనికి పిలిచి మాట్లాడారు. అయితే లోపలికి వెళ్లింది శంకర్ వర్గీయులని, వారంతా జయచంద్రారెడ్డిపై ఫిర్యాదు చేశారని తెలుసుకున్న జయచంద్రారెడ్డి వర్గీయులు ఒక్కసారిగా అక్కడికి చేరుకున్నారు. ములకలచెరువు మండలాన్ని పిలవగానే అందరూ లోపలికి చొచ్చుకు వెళ్లారు. తమ నాయకుడికి అనుకూలంగా నినాదాలు చేయడంతో పాటు, సమావేశ మందిరం బయట గుమికూడారు. ఇరువర్గాల కార్యకర్తల మధ్య మాటామాటా పెరిగి, అరుపులు, కేకలు మొదలయ్యాయి. దీంతో మంత్రి దీపక్‌రెడ్డిని బయటకు పంపి, కేకలు వేస్తున్న వారిని సముదాయించాలని సూచించారు. దీంతో ఆయన బయటికొచ్చి మాట్లాడుతుండగా అక్కడా శంకర్ వర్గీయులే ఉన్నారంటూ మరో వర్గం దుర్భాషలాడడంతో పరిస్థితి చేయిదాటింది. ఇరువర్గాల తోపులాట లో దీపక్‌రెడ్డి చిక్కుకుని నలిగిపోయారు. ఓ దశలో అస్వస్థతకు గురయ్యారు. దీంతో తీవ్రంగా ఆగ్రహించిన మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి కార్యక్రమాన్ని అర్ధాంత రంగా ముగించి బయటకు వచ్చేశారు. పోలీసు వలయంలో వాహనం వద్దకు వెళ్లి తిరుగుముఖం పట్టారు.

ఆరోపణలు.. ప్రత్యారోపణలు..

మంత్రి సమక్షంలో ఇరువర్గాల కార్యకర్తలు తీవ్ర ఆరోపణలు చేసుకున్నారు. వైసీపీ అధికారంలో ఉండగా పార్టీ కోసం కష్టపడ్డామని, కేసులు పెట్టించుకొని 50 రోజులు జైలులో ఉన్నామని, అప్పట్లో తమను వేధించిన వారే ఇప్పుడు టీడీపీ నాయకులుగా చలామణి అవుతున్నారని, తమను జయచంద్రారెడ్డి పట్టించుకోవడంలేదని నిజమైన టీడీపీ కార్యకర్తలకు న్యాయం చేయాలని ఓ వర్గం ఫిర్యాదు చేసింది. అయితే ఈ వర్గం గత ఎన్నికలలో టీడీపీకి ఓటు వేయలేదని, తాము టీడీపీ అని చెప్పుకునే నైతిక హక్కు వారికి లేదని వ్యతిరేక వర్గం ప్రత్యారోపణలకు దిగింది.

మంత్రి వెళ్లాక పిడి గుద్దులు..

మంత్రి కాన్వాయ్ బయలు దేరే సమయంలో మళ్లీ గొడవ మొదలైంది. ధూషణలు, సవాళ్లతో ఆ ప్రాంతం హోరెత్తింది. ఇరువర్గాలు ముష్టిఘాతాలు కురిపించు కున్నారు. ఎవరు ఎవరిని కొడుతున్నారో అర్థం కాక జనం పరుగులు తీశారు. డీఎస్పీ మహేంద్ర, సీఐ జీవన్‌గంగానాథ్ బాబు సిబ్బంది పరిస్థితిని అదుపు చేశారు. కొండపై ఎవరినీ ఉండనీయకుండా ఖాళీ చేయించారు.

మదనపల్లె సమావేశం రద్దు

తంబళ్లపల్లె నియోజకవర్గ కార్యకర్తల సమావేశం రసాభాస నేపథ్యంలో ఇన్చార్జి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, జోన్‌ఫోర్ ఇన్‌చార్జి దీపక్‌రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు మదనపల్లె కార్యకర్తల సమావేశాన్ని రద్దు చేసుకుని వెళ్లిపోయారు.

కార్యక్రమంలో పరిశీలకులు గురువా రెడ్డి, నాయకులు ఎస్ఎం.పర్వీన్‌తాజ్, కొండ్రెడ్డి, మల్లికార్జుననాయుడు, కుడుం శ్రీనివాసులు, మండల కన్వీనర్లు జిట్టావెంకట్రమణ, నారాయణస్వామిరెడ్డి, పాలగిరిసిద్దా, ఆరందరెడ్డి, ఇతర అనుబంధ విభాగాల ప్రతినిధులు , పెద్దసంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

పది నెలల్లో అభివృద్ధి చేసి చూపించా..

- మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లెటౌన్, ఏప్రిల్ 13(ఆంధ్ర జ్యోతి): మండలంలోని కోళ్లబైలు-2 గ్రామ పంచాయతీలో పదేళ్లుగా వైసీపీ ఎమ్మెల్యేలు చేయలేని అభివృద్ధిని పది నెలల్లోనే చేసి చూపించానని ఎమ్మెల్యే షాజహాన్ బాషా తెలిపారు. కోళ్లబైలు-2 పంచాయతీ జామ తోటలో ఆదివారం మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సమక్షంలో టీడీపీ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించాల్సి ఉండగా అనివార్య కారణాలతో మంత్రి సమావేశానికి రాలేకపో యారు. దీంతో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో టీడీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో వెనకబడ్డ కోళ్లబైలు గ్రామంలో రూ.3 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. కబ్జాదారుల చెరలో వున్న 20 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుని, అక్కడ పేద ప్రజలకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తున్నామన్నారు. పంచాయతీలో 425 ఎల్ఈడీ వీధిలైట్లను ఏర్పాటు చేయించామని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కోళ్లబైలు టీడీపీ ఇన్‌చార్జి రాటకొండ శ్రీనివాసులునాయుడు, ఆర్కే రామకృష్ణాచారి చిన్నమహేష్, ఎర్రబెల్లి వెంకటరమణారెడ్డి, డాన్స్ రెడ్డెప్ప, మల్లికార్జుననాయుడు, చలపతి, తదితరులు పాల్గొన్నారు.

'భవన నిర్మాణ' బోర్డు పునరుద్ధరించాలి



ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు, భవన నిర్మాణ కార్మికులు

పీలేరురూరల్ ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి); భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలని ఏఐటీయూసీ పీలేరు నియోజకవర్గ కార్యదర్శి కే. నరసింహులు డిమాండ్ చేశారు. ఆదివారం పీలేరులో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత జగన్ ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును రద్దు చేసిందని విమర్శించారు. కార్మికుల ఇబ్బందులను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల సంక్షేమ బోర్డులను తిరిగి ప్రారంబించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న 46 వేల క్లైములకు నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. 55 ఏళ్లు నిండిన ప్రతి కార్మికుడికి రూ. 6 వేలు పెన్షన్ ఇవ్వాలని , ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నెల రోజులలో సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయక పోతే మే 20వ తేదీన ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీలేరు ఏరియా కార్యదర్శి ఆకేపల్లి నరేంద్ర, కార్మికులు వీ. చంద్ర, ఎస్. మస్తాన్ వలీ, సుబ్రమణ్యం, శ్రీరాములు, మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

పెద్దతిప్పసముద్రం ఏప్రిల్ 13 (ఆంధ్ర జ్యోతి) : రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ యువకుడు చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు అందించిన సమాచారం మేరకు విసనకర్రవాండ్లపల్లెకు చెందిన మౌలా(20) శుక్రవారం తన స్నేహితులతో కలిసి మొలకల చెరువు నుంచి మదనపల్లె వైపు కారులో వెళుతుండగా లారీ ని ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. తిరుపతిలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. బి.కొత్తకోట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో గేదె..

పీలేరు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుదాఘాతానికి గురై ఓ గేదె మృతి చెందింది. ఆదివారం సాయంత్రం పట్టణంలోని సంత ప్రాంగణం సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ పక్కగా వెళుతున్న ఓ గేదె విద్యుదాఘాతంతో మృతి చెందిందంటూ స్థానికులు ట్రాన్స్‌కో ఏఈ ఖాదర్ ఇలాహీకి సమాచారం అందించారు. దీంతో ఆయన అక్కడికి చేరుకుని ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేయించారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు ఆనుకుని ఏర్పాటు చేసిన పబ్లిక్ కొళాయిని అక్కడి నుంచి తొలగించారు.

కలిచెర్ల పోలేరమ్మకు పూజలు

పెద్దమండ్యం,ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి) మండలంలోని కలిచెర్ల పోలేరమ్మ తిరునాళ్ల సందర్భంగా ఆదివారం కడప సుధహర రెడ్డి ఆధ్వర్యంలో పోలేరమ్మకు పూజలు నిర్వహించారు. తంబళ్లపల్లి ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి, ఎంపీపీ పూర్ణచంద్రిక, మిట్టాలపల్లి మధుకరరెడ్డి, సర్పంచ్ విశ్వనాథ రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

సంతానలక్ష్మికి పూజలు

గుర్రంకొండ, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): సంతానలక్ష్మిగా పేరుగాంచిన రెడ్డెమ్మ కొండ ఆలయంలో ఆదివారం ఉదయం అర్చన, పంచామృతాభిషేకం, పూజలు చేశారు. అనంతరం అమ్మవారిని పరిమళ భరిత పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. సంతానం లేని దంపతులు సంతానం కోసం ఆకుపసరు తాగి ఆలయంలో వరపడ్డారు. సంతానం పొందినమహిళలు మొక్కులు తీర్చుకున్నారు. ఈవో మంజుల పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి



నూతన దంపతులను ఆశీర్వదిస్తున్న నల్లారి సోదరులు

పీలేరు రూరల్ 13(ఆంధ్రజ్యోతి); ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, పీలేరు శాసన సభ్యుడు నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి, పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి పీలేరు నియోజక వర్గం కేవీపల్లె మండలం వగళ్లకు చెందిన శేఖర్‌రెడ్డి కుమార్తె శ్రీనిత్య వివాహానికి హాజరయ్యారు. తిరుపతి శ్రీ కన్వెన్షన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నూతన వధూవరులను ఆశీర్వదించారు.

చేపలచెరువు ఆదాయంలో మా పంచాయతీ వాటా ఇప్పించండి

- జిల్లా ఇన్‌చార్జి మంత్రికి టీడీపీ నేతల వినతి

పెద్దతిప్పసముద్రం ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : చేపల చెరువు వేలం ద్వారా లభించే ఆదాయంలో తమ గ్రామ పంచాయతీ వాటా ఇప్పించాలని పోతుపేట పంచాయతీకి చెందిన టీడీపీ నాయకులు జిల్లా ఇన్‌చార్జి మంత్రి జనార్దన రెడ్డికి విన్నవించారు. బూర్లపల్లె, పోతుపేట గ్రామాలు ఒకే పంచాయతీగా ఉన్న సమయంలో పెద్దతిప్పసముద్రం పెద్ద చెరువు చేపల చెరువును వేలం వేయగా రూ.17 లక్షలు ఆదాయం లభించింది. ఆ తర్వాత బూర్లపల్లె, పోతుపేట వేర్వేరు పంచాయతీలుగా ఏర్పడ్డాయి. ఉమ్మడి పంచాయతీగా ఉన్నపుడు చేపల చెరువు వేలం ద్వారా లభించిన ఆదాయాన్ని వైసీపీ మద్దతుదారుడైన బూర్లపల్లె సర్పంచ్ సుబ్బిరెడ్డి తన సొంత ఖాతాలో వేసుకుని, తమ వాటాను ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నాడని, పంచాయతీ నిధులను సైతం తమకు ఇవ్వకపోగా తమను భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని ఆదివారం హార్సిలీహిల్స్‌కు వచ్చిన ఇన్‌చార్జ్ మంత్రి బీసీ జనార్దనరెడ్డి ముందు తమ గోడును వెళ్లబోసుకున్నారు.

మంత్రిని కలిసిన వారిలో పోతు పేట సర్పంచ్ కొండా కళావతి, చిన్నపరెడ్డి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ పర్వీన్‌తాజ్, తంబళ్లపల్లె నియోజకవర్గం నాయకుడు కుడుం శ్రీనివాసులు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు గూటం ఈశ్వరప్ప, బి.కొత్తకోట మండల టీడీపీ అధ్యక్షుడు నారాయణస్వామిరెడ్డి, టౌన్ అధ్యక్షుడు బంగారు వెంకట్రమణ, తంబళ్లపల్లె నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు సూరి తదితరులు ఉన్నారు.


జిల్లా క్రికెట్ జట్టుకు ప్రాబబుల్స్ ఎంపిక



క్రికెట్ ఎంపిక పోటీలలో పాల్గొన్న క్రీడాకారులు

వాల్మీకిపురం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-19, అండర్-23 బాలికల, సీనియర్ మహిళా క్రికెట్ జట్ల 2025 ప్రాబబుల్స్ ఎంపిక కార్యక్రమం ఆదివారం వాల్మీకిపురం జీవీఎస్‌సీఎస్ మైదానంలో నిర్వహించారు. ఉమ్మడి చిత్తూరు డివిజన్‌లకు చెందిన 70 మంది క్రీడాకారిణులు పాల్గొన్నా. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను గుర్తించి, తదుపరి ప్రాబబల్ లీగ్ మ్యాచ్‌ల్లో పాల్గొనే అవకాశాన్ని కల్పించనున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు శ్రీధర్‌కుమార్ తెలిపారు. జిల్లా అధ్యక్షుడు విజయ కుమార్ కృషితో నగరాల్లో లభించే అవకాశాలు గ్రామీణ ప్రాంతాల్లోను అందుబాటులోకి వచ్చాయని, బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ కోచ్ సునీల్ కుమార్, సెలక్షన్ కమిటీ సభ్యులు భరత్, చంద్రిక(కోచ్), అన్నమయ్య జిల్లా క్రీడా భారతి కార్యదర్శి నరేష్‌బాబు, నాగరాజ, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

టీడీపీ నేతల ఫ్లెక్సీలు ధ్వంసం.



ధ్వంసమైన ఫ్లెక్సీలు

కురబలకోట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నేతలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి తంబళ్లపల్లె నియోజకవర్గ పర్యటనకు వస్తుండడంతో రాజంపేట పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు పి. సురేంద్రయాదవ్ బి.కొత్తకోట మండలం కాండ్లమడుగు క్రాస్ నుంచి విశ్వం కళాశాల కూడలి వరకు 10 కిలోమీటర్ల మేరకు రహదారి పొడవునా ఫ్లెక్సీలను ఏర్పాటు చేశాడు. ఈ ఫ్లెక్సీలను గురుతెలియని వ్యక్తులు ధ్వంసం చేయడంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు.

జ్యోతిచౌక్‌లో టీడీపీ కార్యకర్తల ఘర్షణ

బి.కొత్తకోట, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): హార్సిలీహిల్స్‌లో నియోజకవర్గ కార్యకర్తల సమావేశం సందర్భంగా తీవ్రస్థాయిలో దూషించుకొని కొట్టుకున్న తెలుగుతమ్ముళ్లు బి.కొత్తకోటలోని జ్యోతి చౌక్ వేదికగా ఆదివారం మరోసారి ఘర్షణకు పూనుకున్నారు. హిల్స్‌లో జరిగిన గొడవలో బి.కొత్తకోటకు చెందిన వ్యక్తులు కూడా ఉన్నారు. వారికి మరో వర్గానికి చెందిన కార్యకర్తలు బి.కొత్తకోటలో తారస పడ్డారు. మళ్లీ మాటా మాటా పెరిగింది. అక్కడ ఉన్నవాళ్ల జతకు మరికొందరు తమ అనుయాయులను పిలిపించుకొన్నారు. 20 మీటర్ల దూరంలో ఇరువర్గాలు మోహరించి సవాళ్లు, దూషణలు మొదలెట్టారు. ఇంతలో సమాచారం పోలీసులకు చేరడంతో పెద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. ఇరువర్గాలను చెదరగొట్టారు. వీరితో పాటు సర్కిల్‌లో నిలుచున్న వారందరినీ, ద్విచక్రవాహనాలతో సహా ఖాళీ చేయించారు. సీ కవ్వింపు చర్యలకు పాల్పడి, ఘర్షణ వాతావరణం సృష్టిస్తే చర్యలు తప్పవని ఐ జీవన్‌గంగనాథ్‌బాబు హెచ్చరించారు.

అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్తపై కేసు నమోదు

బి.కొత్తకోట, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం తీసుకురావాలంటూ కట్టుకున్న భార్యను వేధిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు బి.కొత్తకోట సీఐ జీవన్‌గంగనాథ్ బాబు తెలిపారు. పట్టణానికి చెందిన నరసింహారెడ్డి(48)కి ఇదే పట్టణానికి చెందిన శ్రీదేవితో 22 ఏళ్ల క్రితం వివాహం అయింది. ఇద్దరు పిల్లలున్నారు. భార్య ఆస్తిలో వాటా, అదనపు కట్నం కావాలంటూ వేధిస్తున్నాడని భార్య శ్రీదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

ఘనంగా మాతమ్మ జాతర



విశేషాలంకరణ లో మాతమ్మదేవి

బి.కొత్తకోట, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హడ్కోకాలనీలో వెలసిన మాతమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారి జాతర ఘనంగా నిర్వహించారు. రెండురోజుల పాటు జరిగే ఈ ఉత్సవంకోసం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.

భక్తులు దర్శనం చేసుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకాలు, కానుకలు సమర్పించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ వేడుకలో పట్టణ ప్రజలతో పాటు భక్తాదులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఇసుకను తోడేస్తున్నారు!

- ప్రతి రోజూ వందలాది లోడ్లు మదనపల్లికి తరలింపు..
- ముంచుకొస్తున్న తాగునీటి ఎద్దడి..



బాహుదా కాలువలో ఎక్స్‌వేటర్‌తో తవ్వి గుట్టలుగా వేసిన ఇసుక

నిమ్మనపల్లి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాహుదా పరిసర ప్రాంతాలు, కాలువల్లో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. దాదాపు 10 నెలలుగా బాహుదా ప్రాజెక్టుతో పాటు, వాగులు, వంకలు, చెరువుల్లోని ఇసుకను మదనపల్లికి త రలించి సొమ్ముచేసుకొంటు న్నారు. కాలువ సమీపంలో భూమి ఉన్న రైతులకు డబ్బు ఆశ చూపిస్తూ, డబ్బుకు లొంగని రైతులపై దౌర్జన్యం చేస్తున్నారు. ఇసుకను ఉచితంగా తోడుకోవచ్చని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిందని, అడ్డుకోవడానికి మీరెవరని ప్రశ్నిస్తున్నారు. కాగా, నిమ్మనపల్లి మండలంలో ఇసుకను తరలించేందుకు ఎలాంటి అనుమతులు లేవు. కేవలం మండల పరిధిలోని పనులకు మాత్రం ఎలాంటి యంత్రాల సాయం లేకుండా మాత్రమే ఇసుక తోడుకోవాలని తహసీల్దార్ ఆదేశాలున్నా వాటిని కూడా పట్టించుకోవడం లేదు. తమ వ్యవసాయ భూముల వద్ద ఇసుకను తోడుతుండంతో నీటి కొరత ఏర్పడుతుందని పలువురు రైతులు పోలీసులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోలేదు. నిమ్మనపల్లి చెందిన కొందరు వ్యక్తులు ఎక్స్‌కవేటర్ల సాయంతో ఇసుకను తవ్వి గుట్టలు వేసి మదనపల్లి నుంచి వచ్చే ట్రాక్టర్లకు లోడుకు రూ.500లకు విక్రయించి సొమ్ముచేసుకొంటున్నారు. దాదాపు 25 కిలోమీటర్ల పొడవున్న బాహుదా కాలువలో ముష్టూరు, అగ్రహారం, నిమ్మనపల్లి. రాచవేటివారిపల్లి, రెడ్డివారిపల్లి, నల్లగొండ తదితర గ్రామాల సమీపంలో ఇసుకను విచ్చలవిడిగా తోడివేస్తుండడంతో నీటి కొరత ఏర్పడుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నెల రోజుల క్రితం స్థానిక ఎస్ఐ తిప్పేస్వామి ఎక్స్‌కవేటర్ యజమానులతో సమావేశం నిర్వహించి అక్రమంగా ఇసుకను తరలించేందుకు యంత్రాలను పంపిస్తే వాటిని సీజ్ చేస్తామని హెచ్చరించారు. అయినా ఇసుకాసురులు తగ్గడం లేదు.



అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు

ఇది ఇలాగే కొనసాగితే నెల రోజుల వ్యవధిలోనే తాగునీటి సమస్య ఏర్పడే అవకాశం వుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇసుకను తరలించకుండా గట్టి చర్యలు చేపట్టి అక్రమార్కులపై కేసులు నమోదు చేసి తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి దీపారాధన



అంబేడ్కర్ విగ్రహంవద్ద దీపారాధన చేస్తున్న బీజేపీ నాయకులు

నిమ్మనపల్లి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్. బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆదివారం మండల బీజేపీ అధ్యక్షుడు సునీల్‌రెడ్డి ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం ముందు దీపారాధన చేశారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ అధిష్టానం ఆదేశాల మేరకు రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహానికి దీపారాధన చేసినట్లు తెలిపారు. ప్రజలు అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శేఖరయ్య, సోమశేఖర్, ముబారక్, రమణ, రెడ్డెప్ప, నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థినికి సన్మానం



విద్యార్థినిని సన్మానిస్తున్న మునిగోపాలకృష్ణ తదితరులు

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షల్లో 989 మార్కులు సాధించిన ఆర్ తేజస్వినిని ఆదివారం స్థానిక జీఆర్‌పీ పాఠశాలలో సన్మానించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ డీఎస్పీ శ్రీనివాసులు నాయుడు, సీనియర్ సిటిజన్స్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముని గోపాల కృష్ణ లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్ డాక్టర్ అప్పినపల్లె భాస్కరాచారి, బీటీ కళాశాల మాజీ కరస్పాండెంట్ వైఎస్ మునిరత్నం, రాష్ట్ర రాపునాడు ఉపాధ్యక్షుడు ఆంజనేయకుమార్, శ్రీచైతన్య కళాశాల ప్రిన్సిపాల్ ఇతరులు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

తంబళ్లపల్లె, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె మండలంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు పొందడానికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో ఉపేంద్రరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 21 నుంచి 60 సంవత్సరాల లోపు వయసు ఉండి తెల్లరేషన్ కార్డు కలిగిన వారు అర్హులన్నారు. ఈ నెల 14 నుంచి మే 10వ తేదీ లోపు ఏపీవోబీఎంఎంఎస్ వెబ్‌సైటులో పేరు నమోదు చేసుకుని ధ్రువీకరణ పత్రాలను ఎంపీడీవో కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

నల్లారి కుటుంబం రుణం తీర్చుకోలేనిది

వాల్మీకిపురం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): నల్లారి కు టుంబం రుణం తీర్చుకో లేనిదని వాల్మీకిపురం వ్య వసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కోసూరి చంద్ర మౌళి అన్నారు. ఆదివారం కలికిరిలో మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని కలిసి సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు. తనకు పదవి రావడానికి సహకరించిన ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ, బాధ్యతతో పని చేస్తానన్నారు. ఈ కార్యక్ర మంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, నాయకులు శేషాద్రిరెడ్డి, రాజ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కలికిరిలో మహాభారత యజ్ఞం

కలికిరి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మహాభారత యజ్ఞం కార్యక్రమంలో భాగంగా కలికిరిలో సోమవారం నుంచి పలు కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. మే 1వ తేదీ వరకు 18 రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమం సర్పయాగం, భీష్మ ప్రతిజ్ఞతో ప్రారంభం కానుంది. ప్రతి రోజూ మధ్యాహ్నం హరికథ, రాత్రి నాటక ప్రదర్శన ఉ ంటుంది. టీటీడీ అన్నమయ్య ప్రాజెక్టు భాగవతారిణి జ్యోత్స్న హరికథ వినిపించనున్నారు. 20వ తేదీ ఆదివారం ద్రౌపదీ కల్యాణం, 23 బుధవారం అర్జునుని తపస్సు మాను ఆరోహణ, 27 ఆదివారం శ్రీకృష్ణ రాయబారం, 30వ తేదీ దుర్యోధనుడి వధ వంటి కార్యక్రమాలుంటాయి. వెంకటేశ్వర నాట్య మండలి ఆధ్వర్యంలో నాటక ప్రదర్శనలుంటాయని వివరించారు.

వైభవంగా ఏటి గంగమ్మ తిరునాళ్లు

తంబళ్లపల్లె, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మం డలంలోని ఎర్రసానిపల్లె పంచాయతీ ఎగు వముత్రావారిపల్లె బస్టాప్ వద్ద ఆదివారం ఏటి గంగమ్మ తిరునాళ్ల నిర్వహించారు. ఆలయ పూజారి మదన్‌మోహన్ అమ్మ వారిని పూలతో అలంకరించి పూజలు చేశా రు. మహిళలు కాలినడకన సామూహి కంగా దీలు, బోనాలూ సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం చాంది నిబండ్లతో ఆలయ ప్రదక్షిణలు చేశారు. ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు.